

కృప
జన్మదినోత్సవ సంచిక

ఆర్తులకు, అర్థార్థులకు ఆలంబనగా, పథగాములకు ఆదరువుగా,
జిజ్ఞాసువులకు  అవగాహనగా, సాధకులకు వెలుగు దివ్వెగా,
సామాన్యులలో స్ఫూర్తిని రగిలించేదిగా రూపుదిద్దుకునే ప్రయత్నంలో
దృశ్యాదృశ్యములుగా (లీలలు), అన్వేషకులకు సమాధానంగా
గురుని అనుగ్రహం గురుకృప అనుక్షణం అండగా లభిస్తోంది.
ఈ అండా దండా ఆయనందించిన అనుగ్రహభాషణానుభవాలలో
స్ఫూర్తి, స్పర్శనాదులుగా అంది - గమ్యం చేర్చే మార్గాన్ని సుగమం చేస్తుంది.
అందుకే అన్నింటికీ మూలం గురుకృప అంటుంది వేదం.

గురుప్రార్ధన, గురుపూజ, గురుసేవ, గురుధ్యానం, గురుకీర్తనం
గురులీలల మననం, గురునామస్మరణం, పారాయణలు,
సత్సంగం అనే పద్మానికి అష్టదళాలవంటివి.

ఈ అష్టదళారాధనే హృదయ పద్మాన్ని వికసింపచేసేది.
అట్టి వికసించిన హృదయమే గురుని ఆలయం.... నిలయం...
గురుదేవుని హృదయ పద్మములో ప్రతిష్ఠించుకొని
ఆరాధిస్తే అది నిత్య సత్సంగమే.
- గురుకృప

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# కృప

జన్మదినోత్సవ సంచిక

కోరి మమ్మునేలినట్టి దైవం...  శ్రీబాబూజీ

# శ్రీసాయిబాట - శ్రీబాబూజీ మాట



**నా భక్తుడు** అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలచుకున్నది వారు అడిగేంతవరకు. మొత్తం బాబా తత్వానికి ఇది కేంద్రబిందువనిపిస్తుంది. ఆయన ఇవ్వదలచుకున్నది ఏమిటో మనకు చెప్పలా. ఆత్మసాక్షాత్కారమా, ముక్తా, ఇంకోటా, ఇంకోటా ఆయన ఏమీ చెప్పలా. ఆయనేదో ఇవ్వదలచుకున్నాడట, తొందరలేదు ఆయనకి. మనం అడిగిందాక ఇస్తాడట మనం అడిగినవన్నీ, కానీ ఎప్పటికండీ మనం అడిగేది అసలు! ఆయన ఇవ్వదలచుకున్నది మనం అడిగే అవకాశం ఉన్నదా అసలు! అలలు తగ్గిపోయిన తరువాత స్నానం చేయటంలాగా, సముద్రంలో అలలు తగ్గిపోయిన తరువాత స్నానం చేస్తాం అన్నట్టుగా! మనకు ఎప్పుడు కోరికలు తగ్గేటట్టు? మన కోరికలన్నీ అయిపోయి, "ఇంక నాకేం కోరికలు లేవు అడిగే దానికి, ఇక నీవు ఇవ్వదలచుకున్నది ఏదో అది ఇయ్యి" అని అడుగుతామా అసలు ఎప్పటికైనా, అని అనుమానం రావచ్చు ఎవరికైనా సరే. (సాయి భక్తి రసం యొక్క రుచి తెలియని కొందరు బుద్ధిమంతులకు కలుగ వచ్చు. బాబా కేవలం మన కోరికలు తీర్చడం మాత్రమే కాదు, వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటి వల్ల సరైన పంథాలో ప్రభావితమయ్యేట్లు కూడా చూస్తారు. ఎవరికి వారు తమతమ అనుభవాలను జాగ్రత్తగా విశ్లేషించి సమీక్షించుకుంటే శ్రీసాయి కేవలం 'వర' దైవమే కాదు, 'పర' దైవం కూడానన్న సత్యం బోధపడగలదు. అంతేకాదు,

*(Contd. in Page 31)*

ఇహపరశ్రేయోదాయకమైన సాయిభక్తి యోగం యొక్క ప్రాశస్త్యం కూడా అవగతం కాగలదు. సాయిభక్తి సాధనా రహస్యం) కానీ, ఆయన ఇచ్చేటప్పుడు ఎట్లా తీరుస్తాడంటే, ఈ కోరికలు తీర్చేటువంటి పద్ధతి ఎలా ఉంటుందనంటే - కొంతకాలం వెళ్ళేటప్పటికి ఏమవుతుందనంటే ఆయన ఇవ్వదలచుకున్నది ఏమిటో మనం అడిగేటట్టుగా చేసుకుంటాడు.

అంటే ఏంటి, మనకు కష్టం లేకుండా, మనకు బాధ లేకుండా ఎంతకాలమైనా పట్టచ్చు. అది ఒక జన్మ పట్టచ్చు. కొన్ని జన్మలు పట్టచ్చు. ఆయనకు తొందర లేదు, మనవైపు నుంచి మనకేమిటి, మనం అడిగినవన్నీ ఇస్తూ ఉంటాడు. మనకు కావలసింది అంతే. దీన్ని వద్దనలా ఆయన. ఈ ప్రాపంచికమైన కోరికలు కోరద్దని చెప్పలా. ఆకలో, ఆకలో అంటున్న వాడిని కూర్చోబెట్టి వేదాంతం విను అంటే వాడికి ఎక్కడ బుర్రకెక్కుతుంది?

బాబా ఇంకొక మెట్టు ముందుకి పోయాడాన. మనయొక్క అవసరాల కోసమే కాదు, ఆయన చెప్పినటువంటిది మన కోరికలకు కూడా. బాబా ఏమి చెపుతున్నారు. మన మానసికమైనటువంటి కోరికల సంగతి కూడా చెపుతున్నా డాయన. చెపుతూ తీర్చడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు. ఇది వేరే, అది వేరే అనేటువంటి భావన మాత్రం ఆయన కలగనివ్వలా. ప్రపంచంలోనే ఉంటూ, మన ప్రాపంచిక కోరికలను ఆయనను అడుగుతూ, దాని ద్వారా ఆయనతో అనుబంధం పెంచుకుంటూ (పోయేలా చేసేదే) పోవడమే సాయిపథం.

Just remember that, Baba knows best what we need (want) that he will give it. That's enough. **- Sri Babuji**





గ్రహిస్తారు. కర్తవ్య నిర్వహణ నిండుగా కొనసాగిస్తారు – అని వారికి వివరించాను. ఆ అభయవచనం వారిని సేదతీర్చింది. వాళ్ళముఖాలలో వెలుగు రేఖలు గోచరించాయి.

కొంతసేపటి తరువాత ఆమెను పిలిచి కూర్చోబెట్టి అడిగితే జరుగుతున్నది ఆమె చెప్పింది. జరుగవలసినది నేను చెప్పాను. అనన్యచింతన అన్నది ఎలాగ సాగాలి అన్నది ఆమెకు వివరించాను. నా వివరణ ఆమెకు నచ్చింది. ఆమెకు కావలసిన ప్రచోదనం అందింది. ఆమె ముఖంలో ఎనలేని తృప్తి తొణికిసలాడింది. తాను నమ్మిన దైవమే ఇలా కలుగచేసుకొని నడిపిస్తున్నాడు అన్న దర్శనాన్ని పొంది, ఆమె పరవశించింది. దానితో కథ దారికి వచ్చింది. అప్పటి నుండి ఆమె నుండి జరిగినది పర్యుపాసన. అప్పటినుండి ఆమెను అనుభవానికి వచ్చినది – నిత్యాభియుక్తస్థితి. దేవదేవునితో నిత్యానుసంధానస్థితి. నిత్యానుసంధానము అంటే ఎడతెగని అనుసంధానము. ఆ అనుసంధానము అలా సాగుతూనే ఉంటుంది. అనన్యస్థితి అంటే ఇది అని అప్పటికి అనుభవమవుతుంది.

**– శ్రీ మోపిదేవి కృష్ణస్వామి, పార్థసారథి ప్రవచనాలు నుంచి**

## ప్రతిజ్ఞ

నా మనసు ఎప్పుడూ జిజ్ఞాసను, నేర్చుకోవాలనే దృక్పథాన్ని కలిగియుండాలి.
అర్థరహితమైన వ్యర్థాచారాలతో, మూఢవిశ్వాసాలతో నా వివేకాన్ని అంధకారం కానివ్వను.
నా మనసును ఎప్పుడూ సంకుచిత భావాలకు, వికారాలకు, జాతి, కుల, మత, వర్గ ప్రాంతీయ భావాలకు లోనుకానివ్వను.
నేను నా దేశాన్ని ప్రేమిస్తూ, ఒక **ఆదర్శ ప్రపంచపౌరునిగా** ఎదిగేందుకు శ్రమిస్తాను (ప్రయత్నిస్తాను).
ఇతరుల నుంచి నేను ఏది ఆశిస్తానో అదే విధంగా నేను ఇతరుల పట్ల నడుచుకుంటాను.
నాకుగానీ, నా ఉపాధ్యాయులకుగానీ లేక నాతోటి విద్యార్థులకుగానీ అపకీర్తిని కలిగించే ఏ పనులు నేను చేయను.
నా మనసులో అధైర్యమునకు తావు లేకుండా ఎప్పుడూ తల ఎత్తుకునే జీవిస్తాను.
మనమందరం గర్వించే విధంగా నా పాఠశాలను ఒక అందమైన, ఆనందమైన ప్రదేశముగా ఉంచేందుకు నిరంతరము శ్రమిస్తాను.
ఇదే నేను భక్తిపూర్వకంగా చేసే ప్రతిజ్ఞ, నా హృదయప్రార్థన.

– శ్రీబాబూజీ



సంపుటి : 18
జనవరి 1



సంచిక : 1
2015



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

ఉంటే సద్గురువన్న ఎరుక – జీవితమంతా వేడుక 4
– గురుకృప

మృత్యుభయం 9
– శరచ్చంద్రికలు

సేవ 16
– మురళీయం

ఆత్మ పరిశీలన చేసుకున్న వేళ 20
అక్షరాలలో అనుభూతులు

గురునితోడి సంబంధం 24
– గురుకృప

అనన్య చింతన నీది – యోగక్షేమాలు నావి! 25
– పార్థసారథి ప్రవచనాలు

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు***

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.




## ఉంటే సద్గురువన్న ఎరుక - జీవితమంతా వేడుక

వివేక చూడామణిలో శంకరులంటారు – "దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహహేతుకమ్, మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః" విశ్వంలో ఈ మూడూ దుర్లభమైనవి, ఆ విశ్వేశ్వరుని అనుగ్రహం వల్ల మాత్రమే సంభవించేవి. మనుష్యత్వం – మనిషిగా జన్మించడం, ముముక్షత్వం – మోక్షాన్ని పొందాలనే ఆకాంక్ష; మహాపురుషుల సంశ్రయం – మహాత్ముల సాన్నిధ్యం. ఆహా! దుర్లభమనే ప్రతీ అంశము మన జీవితాలలో సాక్షాత్కారించ అనుగ్రహించెను కదా! ఆ సద్గురు చంద్రుడు. (పుట్టు భోగులం–భువి గురుదాసులం. నీవు పుట్టకముందే ఆయన నిన్ను ఎన్నుకుని ఉన్నారు). మనుష్య జన్మతోనే సరి అనుకున్న మనకు త్యాగరాజులు చెప్పినట్లు నిధి సుఖమా? రాముని సన్నిధి సుఖమా? అన్న మీమాంసను కలిగించి, నిధికన్నా సాయిసన్నిధి సుఖమని తెలియచెప్పి ముముక్షువుగా మార్చిన మహితాత్ములు కదా మన గురుదేవులు!

గురుదేవా! జన్మజన్మల సుకృతమేమియును గాంచగలేను! ఏ పరి వెతికినా నా దుష్కృతములే గాంచగల్గితి. అగోచరమగు 'కర్మానుగత' జీవితమను అర్ధమెరిగినవాడనుగాను ప్రభూ! ఒక్క విషయము మాత్రము రూఢిగా అవగతమయ్యెను. అది మీ సమున్నత సంశ్రయము – మీ సాన్నిధ్యము. అపురూపమైనది మీ 'రూపము' – అది మాకు ఆనందాశ్రయ స్వరూపము. సదా సాయి 'ప్రజ్ఞ'లో సాగిన మీ అడుగులు – సాయిపథగాములకు మీరు అందించిన పూదోటల రాచబాటలు. నాడు సగరులను సత్యలోకము చేర్చుటకు భగీరథుడు గంగను భూమికి తెస్తే, ఈనాడు 'సాయి' అనే ఆనందామృత రసగంగను మా జీవితాలలో పారించి, కల్మష కాఠిన్యాలను తొలగించిన మహా మహితాత్ములు మీరు. సద్గురూ! సుమధుర షడ్రసోపేతము మీ చింతనామృతము, సుశ్రావ్య ధ్వని ధన్యామృతము మీ కీర్తనము! సుకైవల్య పదమునకు సోపానము మీ పాదసేవనము. మీ 'ఎఱుక'లో మా జీవ(న)ము! మరచిన నాడు మరణము!

బాబా కృపాకటాక్ష వీక్షణాలనే అమృతధారలు ఎప్పుడూ అందరిమీద కుండపోతగా వర్షిస్తూనే ఉన్నాయి. కానీ, మన అజ్ఞానం, అహంకారం అనే గొడుగు ఆ అనుగ్రహధారలు మనమీద పడకుండా అడ్డుకొంటున్నది. ఆ అజ్ఞానాన్ని తొలగించుకొని, ఒకసారి కళ్ళు తెరచి చూస్తే శ్రీసాయి అనుగ్రహవీక్షణాలు ఎప్పుడూ మనమీదనే ఉన్నాయని గ్రహిస్తాము. అలా శ్రీసాయి దృష్టి సదా మనమీద ఉన్నదన్న గురుతే (ఎరుకే) మనకు గురువై మనలను రక్షించి తరింపచేస్తుంది. ఆ ఎరుకను (గురుతును) సాధ్యమైనంతగా నిరంతరం నిలుపుకోవడమే సాధన. ఆ ఎఱుకలో నిలవడమే అనన్యభావంతో సద్గురువుకు శరణాగతి చెందడం. ఈ ప్రయత్నం మనవైపు నుండి జరగవలసిన క్రియ.






అంతటా, అన్నిటా అతడు మనకు గోచరిస్తునే ఉండాలి! అప్పుడు ఈ విశ్వంయొక్క రూపం భగవానుని విశ్వరూపమవుతుంది. విశ్వం స్థానంలో మనకతడే కనబడతాడు.

ఒక రోడ్డు వెంట సామాన్యస్థితిలో ఉన్న మానవుడు, ఆ ప్రక్కనే రామకృష్ణ పరమహంస కలసి నడుస్తున్నారనుకోండి. సామాన్యస్థితిలో నున్న మానవుడునికి ప్రపంచం, దాని పోకడలూ కనిపిస్తాయి. రామకృష్ణ పరమహంసకు దైవము, అతని లీలలూ గోచరిస్తాయి. ఇద్దరూ ఒకే రోడ్డుపైన నడుస్తున్నారు. ఒకే విశ్వంలో నడయాడుతున్నారు. కాని ఎవరి దర్శనం వారిది. ఒకరికది విశ్వం, మరొకరికది దైవం. అనన్య చింతన యొక్క ఫలితం ఇలా ఉంటుంది. ఇంతవరకూ చెప్పుకొన్నట్లుగా అనన్య చింతన సాగవలసి ఉంటుంది.

కాకినాడకు దగ్గర ప్రాంతంలో ఒకామె ఉంది. ఆమెకు దైవభక్తి మెండు. ఆ ఊరిలో ఒక దేవాలయముంది. ఆ దేవాలయంలోని దేవుని మూర్తి అంటే ఆమెకు ఎనలేని ఇష్టం. దానితో తరచుగా ఆమె ఆ దేవాలయానికి వెళుతూ ఉండేది, ఒకరోజులోనే చాలాసార్లు వెళ్లివస్తూ ఉండేది. క్రమంగా రోజు మొత్తంమీద ఇంటిలో ఉండే సమయం కన్నా గుడిలో ఉండే సమయం పెరిగిపోయింది.

పొయ్యిమీద బియ్యం కడిగిపెట్టి, కూరలు, పులుసులూ కూడా పెట్టి గుడికి వెళ్లిపోయేది. ఇప్పుడే వచ్చేద్దాం కదా అనుకునేది. గుడిలో అలా కూర్చుండిపోయేది. పొయ్యిమీద పదార్థాలు మాడిపోయేవి. ఇంటిలో భర్త, పిల్లలు అల్లాడి పోతూ ఉండేవారు. వారికేం చేయాలో తోచేది కాదు. ఆమెను ఔననలేరు, కాదనలేరు. అయోమయ స్థితిలో పడిపోయారు. నచ్చచెప్పడానికి ప్రయత్నించినా పెద్ద ప్రయోజనం ఉండేది కాదు. అదంతా ఆమె తెలిసి చేయడం లేదు కదా! కూర్చుండిపోదామని వెళ్లడం లేదావిడ! కాని కూర్చుండిపోతుంది. ఒకసారి వెళ్లిన తరువాత కదలలేకపోతోంది. దానితో మిగిలిన దినచర్య కుంటుపడుతోంది. కర్తవ్య నిర్వహణలో అనిశ్చిత స్థితి చోటు చేసుకుంటోంది. బంధుమిత్రులు తట్టుకోలేక పోతున్నారు. కాని, చేయగలిగినది లేదు. ఒకప్రక్క వారి దినచర్యలు దెబ్బ తింటున్నాయి. కుటుంబజీవనం దారి, తెన్నును కోల్పోతుంది. రెండవ ప్రక్క ఆమె ఏమయిపోతుందోనన్న ఆందోళన వారిని బాధిస్తోంది.

ఆమె బంధువులు ఆమెను నా దగ్గరకు తీసికొని వచ్చారు. పరిస్థితి చెప్పారు. దిగులుగా ముఖం పెట్టారు. నేను భాగవతం ప్రథమ స్కంథంలోని ఒక సూక్ష్మంశాన్ని గూర్చి వారికి వివరించాను. భక్తిభావనలో పడి తాత్కాలికంగా కర్తవ్యాన్ని నిర్వహించలేని వారుంటారు. వారిని గూర్చి కంగారు పడవలసిన పని లేదు భగవంతుని అభయహస్తం వారిని వెన్నంటి ఉంటుంది. తగిన సమయంలో వారికి కావలసిన ప్రచోదనం అందుతుంది. దానితో వారు అనన్య చింతన యొక్క నిజస్వరూపాన్ని




నిద్రలో మనం గమనించవలసిన సూక్ష్మం మరొకటి ఉంది. మనం నిద్రపోతున్నపుడు మనలో కొంతభాగం విశ్రాంతి తీసుకుంటుంది. కొంతభాగం పని చేస్తూనే ఉంటుంది. మనస్సు, ఇంద్రియాలు విశ్రాంతిని తీసుకొంటున్నాయి. గుండె, ఊపిరితిత్తులు మొదలయిన దేహభాగాలు పనిచేస్తూనే ఉంటాయి. మనస్సు, ఇంద్రియాలు మానవరాజ్యం అనబడతాయి. ఆ వెనుకన విశ్రాంతి కోరని రాజ్యమున్నదే అది దేవునిరాజ్యం. నిద్రలో జరుగుతున్నది ఏమిటి అంటే మానవరాజ్యం దేవుని రాజ్యంలో కరిగిపోతున్నది. మళ్ళీ మెలకువ వచ్చినపుడు మానవరాజ్యం దేవుని రాజ్యం నుడి ఈవలకు వ్యక్తమవుతున్నది. ఇది ఒక దివ్యమయిన స్థితి. దివ్యమయిన అనుభూతి. ఇటువంటి స్థితి మనం మేలా ౹ంచి ఉండగా కూడ అనుభవానికి వచ్చిందనుకోండి. అదే మోక్షస్థితి. తురీయస్థితి. దానినే మనం సమాధి అంటున్నాం. నిద్రలో అనుభవానికి వస్తున్నదేదో అది మేల్కొని ఉండగా కూడా అనుభవానికి రావాలి. అంత హాయి అనుభవానికి వస్తుండగా దినచర్య దేవతార్చనగా సాగాలి. మానవరాజ్యం దేవునిరాజ్యంతో శ్రుతి కలిపి దానితో తాదాత్మ్యం చెందుతూ, ఆ తాదాత్మ్యస్థితి నుండి దినచర్యను ఒక ధ్యానంగా, ఒక గానంగా వ్యక్తం చేయగలగాలి. వీణ నుండి వీణాగానం వ్యక్తమైనట్లు, దేహం మీదుగా కర్మ సంగీతం వ్యక్తం కావాలి! ఆ కర్మ సంగీతం సృష్టిగానంతో శ్రుతి కలపాలి! అప్పుడది వేదమవుతుంది. నాదమవుతుంది. వేదనాదమవుతుంది. నిద్రలో కూడా అతడినే చూడగలిగినప్పుడు అటుపైన అతడనుగ్రహించే దివ్యస్థితి ఇలా ఉంటుంది.

ఇంకా ప్రహ్లాదుడు ఎలా ఉపాసిస్తున్నాడు, 'తిరుగుచున్, లక్షింపుచున్' అనగా అతడు ఉపాసన పేరిట ఒకచోట కూర్చుండిపోవడం లేదు. నిరంతరం కర్తవ్యశీలియై ప్రవర్తిస్తున్నాడు. ఆ కర్తవ్యనిర్వహణలో వివిధములయిన రాకపోకలు చేస్తూనే ఉన్నాడు. ఆ రాకపోకలన్నింటిలో అతడు దైవాన్నే అనుభవిస్తున్నాడు. ప్రతి కదలికలోనూ అతడికి పరమాత్మే గోచరిస్తున్నాడు. మానవుని కదలికలే దేవుని కథానికలు అన్న అనుభూతి అతనికి నిరంతరం అంది వస్తూ ఉన్నది.

అలాగే ఇది చేయవలసిన పని అని ఒక పనివైపు చూస్తున్నప్పుడు ఇతడితో మాట్లాడవలసి ఉన్నది అని ఒక వ్యక్తితో మాట్లాడవలసి వచ్చినప్పుడు అతనికి దైవమే గోచరిస్తున్నాడు. లక్షింపుచున్, అన్నమాటకు అర్థమిది. ఇది అంటూ అతడు దేనిని చూస్తున్నా, దేనిని గుర్తిస్తున్నా, దేనివైపు చూస్తున్నా దేనిని చూపెడుతున్నా అక్కడ దైవమే పొడగడుతున్నాడు. పనిని చేస్తున్నవాడు. ఆ పనియొక్క ఫలితాన్ని అందుకొంటున్నవాడు, జరుగుతున్న పని. అంతటా దైవమే! కర్త, కర్మ, క్రియ మూడింటా ఉన్నది దైవమే! పని జరగడం కొరకు అతడలా ఉంటున్నాడు. చూస్తున్నవాడు చూడబడుతున్నది, చూడడమూ – మూడూ దైవమే! సృష్టి కథ కొరకు అతడలా మూడుగా కనబడుచున్నాడు. కథ నడుస్తూనే ఉండాలి.






సాయితత్త్వ సాగరాన్ని ప్రేమతో మదించి, భక్తితో జ్ఞానరత్నాలను వెలికి తీసిన మహితాత్ములు, పూజ్య సద్గురుదేవులు ప్రేమతో పంచిన సాయిభక్తి 'సాధనలు' – ఆనందమే తానైన 'సాయి'ని చేరేందుకు సోపానాలు'– ఈ సద్గురు ఉచ్ఛిష్టామృత వచనాలు.

**'ఎరుక'లో జీవించాలి – 'ఆ ఒక్క అడుగు' సాధించాలి :** బుద్ధ భగవానుని మహాసమాధి అనంతరం – భిక్షాపాత్ర చేపట్టి పురమునకు పయనమయ్యారు శిష్యులు. బుద్ధ భగవానుని గాంచని ప్రజలు భిక్షను అందించ నిరాసక్తులయినారు. ఎంతోమంది శిష్యులకు భిక్ష లభించనే లేదు. ఇలాంటి సందర్భములో ఒక భిక్షువుకు గర్భిణి అయిన ఓ మాతృమూర్తి భిక్ష ప్రసాదింప ఉద్యుక్తురాలయ్యింది. ఏనాడూ స్త్రీమూర్తిని గమనించని ఆ భిక్షువు ఇలా అడిగాడు. "అమ్మా! ఏల మీ ఉదరభాగము ఎత్తుగా గాన్పించుచున్నది?" సోదరా "భగవత్ప్రసాదముగా నా కడుపున ఒక బిడ్డ పెరుగుచున్నాడు" అనెను. "బిడ్డ కడుపులో పెరుగుచున్న మీ ఛాతీ భాగము ఏల పరిపుష్టమాయెను". "కడుపులో పెరుగుచున్న బిడ్డ ఆకలి తీర్చ ఆహారావసరాదుల నిమిత్తము పాలను సమకూర్చుటలో భాగము ఇది" అని సెలవిచ్చెను ఆ తల్లి. సాదరముగా ఆమెకు నమస్కరించి భిక్షను స్వీకరించకనే వెనుదిరిగెను ఆ భిక్షువు.

భిక్ష స్వీకరించలేదేమని అడిగిన సోదర భిక్షువుకు "అవనిపై అరుదెంచని బిడ్డకే భగవంతుడు ఇన్ని ఏర్పాట్లు చేస్తే జీవితాన్నిచ్చిన వాడు నాకు భిక్షను ఏర్పాటు చేయక మానతాడా?" అని సమాధాన మిచ్చాడు భిక్షువు. తాను విశ్వసించిన సద్గురుని దృష్టి సదా తనమీద ఉన్నదన్న ఎరుక (గురుతు) కలిగింది. భిక్షువు పయనం ఆగింది. చింత తొలగింది – వివేకం వికసించింది.

అభయదాయి – శ్రీసాయి సదా మనతో ఉన్నారన్న ఎరుక మనలో ఉన్నంతకాలం మన జీవితాలు దీక్షిత్ ఇంటిలోని పనిపిల్లలా సదా ఆనంద డోలికలలో సాగుతాయి. గురుదేవులంటారు "బాబా సంతోషము, పరమానందము యొక్క నిజతత్వాన్ని తనదైన చక్కని శైలిలో వివరించారు. కాకా సాహెబ్ దీక్షిత్ పనిపిల్లకొక క్రొత్తచీర ఇచ్చారు. ఆమె ఆ చీరను ధరించకుండా ఒక పెట్టెలో భద్రపరిచింది. కానీ ఆనందంతో గంతులు వేస్తున్నది. తన క్రొత్త చీర పెట్టెలో ఉన్నదన్న ఆ ఎరుకే ఆమెకు అంతటి ఆనందాన్ని కలిగించి, ఆ ఆనందంతో నాట్యమాడేలా చేసింది. "ఒక్కసారి" అవును ఆయన నావారు, ఆయన నాకు చెందినవారు, నేను ఆయనకు చెందినవాడిని" అనే ఎరుక ఉంటే అది చాలు. అందుకని మనమంతా కాకాసాహెబ్ దీక్షిత్ పని పిల్లలాగా ఉందాము. ఆమెకు చక్కగా చీర ఉన్నది. మనకు బాబా ఉన్నారు. ఇక దుఃఖానికి తావేది? కలత చెందడానికి ఏమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం. ఆనందంతో ఆస్వాదిద్దాం. నృత్యం చేద్దాం."




తరచి చూసుకుంటే సదా సాయి మనతోనే ఉన్నారన్న 'ఎరుక' మనలో లోపించే క్షణాలే మనలో ఆదుర్దాకు ఆద్యాలు. ఇరవై కిలోల సూట్‌కేసును తండ్రి మోసుకొచ్చాడు ఇంటికి తన యాత్ర ముగించుకొని. ఇంట్లో చిన్నారి ఆ సూట్ కేసును ఎత్తే ప్రయత్నం చేస్తున్నాడు గంటల తరబడి. ఏమిటా వీడు ఆపసోపాలు పడిపోతున్నాడని గమనిస్తే ఆ బరువు మొత్తం మోయాలని చిన్నారి తంటా. సూట్‌కేసు పైనున్న మీట నొక్కాడు తండ్రి. సూట్‌కేసు క్రింద ప్రత్యక్షమయ్యాయి $360^0$ చక్రాలు. చక్కగా అనాయాసంగా ఎటు కావాలంటే అటు తీసుకెళ్లాడు చిన్నారి. మన జీవితమనే సూట్‌కేసు మీట ఆయన చేతిలో ఉన్నదన్న ఎరుక ఉంటే చాలు మన ముఖాన చిరునవ్వు చెదరదు, మన విశ్వాసం సడలదు. All the switches are at Baba's finger tips. He can give or change an experience with the flick of a finger. - SriBabuji

అక్షర అర్ధ గాంభీర్యపు మాటలలో ఎంత చెప్పినా 'ఎరుక'ను నిలుపుకునే ప్రయత్నమెలాగో నిర్వచించలేము. ప్రతీవ్యక్తి తనదైన మార్గంలో సద్గురువును అంటిపెట్టుకోవడమే నిజమైన ప్రయత్నం. ఒకరికి సత్సంగం, మరొకరికి స్మరణ, ఇంకొకరికి రూపం, చాలామందికి ఆయన స్వరూపం. ఇంకొంతమందికి ఆయన రచనలు, మరికొంతమందికి ఇతరులకు సేవ చేయడం – ఇలా మార్గమేదైనా సరే ఆ ఎరుకలో నిలిచే ప్రయత్నమే మన జీవితాలకు గమ్యం. (మనమందరం బాబా తోటలో పువ్వులం. ప్రతి మొక్క, ప్రతి పువ్వు – తనదైన రీతిలో, తనకు తగిన సమయంలో, తనదైన తియ్యదనంతో విరబూస్తుంది. – శ్రీబాబూజీ)

**ఎరుక సహజమైతే – మనసు పుష్పమైతే :** సాధ్యమయ్యేదేనా ఈ అంశం? ఇంతకుముందు జరుగకపోతే ఆలోచిద్దాం. నమస్కారం చేయడం అందరం అలవాటుగా చేస్తున్నాం. ఎంతమందికి 'నేను'కు 'ఆస్కారం' లేకుండా పోయింది. అంతమాత్రాన అంత గొప్ప అంశాన్ని వర్జిస్తున్నామా? సద్గురు ప్రజ్ఞ (ఎరుక) ను సదా మనలో నిలుపుకునే ప్రయత్నం చేస్తే మన అడుగులు బాబావైపుగా సాగుతాయి. ఒక సందర్భమెదురైతే బాబాలాగా ఆలోచించడం మొదలుపెడతాం, బాబాలాగా ప్రవర్తించడం మొదలుపెడతాం.

గమనిస్తే పూజ్య గురుదేవుల ప్రతి చర్యలోనూ ఆ సాయిప్రజ్ఞ భాసిస్తుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసల మొదలు, మంచినీళ్ళు స్వీకరించడం నుంచి, ఆహారం తీసుకోవడం, ... ఇలా అనుక్షణం సాయి అన్న ఎరుకలో నిలిస్తే ఇక చింతకెక్కడ చోటు. జీవితంలో మనకు ఎక్కడుంది లోటు?

ఇంకో చారిత్రక కోణం చూద్దాం. హిరణ్యకశిప మహారాజుకు జన్మించాడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదునికి






పానీయ స్వీకరణలో దాహము తీరుతున్నవేళ దైవమే అతడికి గోచరిస్తున్నాడు. దైవమే పానీయమై, దాహాన్ని తీర్చి, ఇలా దేహాన్ని నిలబెడుతున్నాడు. అన్న గమనికను అతడందుకొంటున్నాడు. ఆహార స్వీకరణలో ఆకలి తీరుతున్నవేళ ఆ దైవమే అతడికి గోచరిస్తున్నాడు. ఆకలి అతడే, ఆకలికి అన్నము అతడే, అంటున్నది అతడే. రుచిగా అనుభవానికి వస్తున్నది కూడా అతడే! వీటన్నింటి ద్వారా దేహాన్ని పోషిస్తున్నదీ అతడే! దేహమూ అతడే! ఇలా అన్నిటా అతడే గోచరిస్తున్నాడు. అన్నపానాల స్వీకరణ అర్చన అవుతున్నది. ఒక యజ్ఞ విశేషమవుతున్నది.

కర్తవ్యనిర్వహణలో భాగంగా అతడు సంభాషణలు జరుపుతున్నాడు. అలా మాట్లాడేటప్పుడు కూడా మాటమాటలో, మాటమాటకు దైవమే అతడికి అనుభవానికి వస్తున్నాడు. మాట్లాడుతున్నది దైవము. మాటలు దైవము. ఎవరితో మాట్లాడుతున్నాడో వారు దైవము. అంతటా దైవమే అతడికి అనుభవానికి వస్తున్నాడు. ఇలా జీవన వ్యాపారమే ఒక ఆరాధనా విశేషంగా రూపుదిద్దుకొంటున్నది.

అర్చన అన్నది తీవ్రంగా సాగనక్కరలేదు. భయపడుతూ చేయనక్కరలేదు. మామూలు మాటల్లో చెప్పాలంటే మనం సీరియస్‌గా ఉండనక్కరలేదు. ఆడవచ్చు, పాడవచ్చు. హాయిగా ఉండవచ్చు. లీలగా వర్తించవచ్చు. ముచ్చటగా ప్రవర్తించవచ్చు. అంతేగాని మూతి ముడుచుకొని, నొసలు చిట్లించుకొని, తోటివానికి జంకు కలిగేటట్లుగా ప్రవర్తించడం అర్చనకాదు. పవిత్రత పేరిట బిగుసుకు పోవడం అర్చన కాదు. అది తెలియచెప్పడానికే ప్రహ్లాదుని చరిత్రలో "హాసలీలా నిద్రాదులు సేయుచున్" అని చెప్పబడింది. సందర్భాన్ని బట్టి అతడు నవ్వుతున్నాడు. లీలగా వర్తిస్తున్నాడు. కాని అప్పుడు కూడా, అందులో కూడా ఆ దైవాన్నే అతడు అనుభవిస్తున్నాడు. దైవమే చిరునవ్వయి అతడి పెదవుల నుండి పూస్తున్నాడు. నవ్వుల పువ్వులను విరజిమ్ముతున్నాడు. దైవమే తన లీలను అతడి నుండి చూపుతున్నాడు. అవలీలగా 'అతని' లీలగా కర్తవ్య నిర్వహణ సాగిపోయేట్లు చూస్తున్నాడు. కనుక నవ్వులూ అతడే, లీలలూ అతడే. ఆ మధ్యలో విశ్రాంతినందించే నిద్రకూడా అతడే! అలసిన శరీరాలకు, ఇంద్రియాలకు, మనస్సుకు నిద్ర రూపంలో అతడు విశ్రాంతినిస్తున్నాడు. సేద తీరుస్తున్నాడు. మరునాడు పనిచేయడానికి కావలసిన శక్తియుక్తులను సంతరించి పెడుతున్నాడు. నిద్రనుండి లేచేటప్పటికి దివ్యమయిన తాజాదనాన్ని అతడు అనుభవానికి తెస్తున్నాడు. ఒక ఉత్తేజం, ఒక ఉత్సాహం పొంగుకొచ్చేలా చేస్తూ, కర్తవ్యనిర్వహణ యెడల కావలసిన ఉన్ముఖత్వాన్ని కలిగిస్తున్నాడు. నిత్యనూతన స్థితిలో మనసు నిలబెడుతున్నాడు. చూసారా! నిద్రలో నిద్రగా అతడెంత చేస్తున్నాడో! కనుక నిద్రలో కూడా అతడే అనుభవానికి వస్తున్నాడు అంటున్నాడు ప్రహ్లాదుడు.




మాత్రమే.

సృష్టి అంతా భగవానుని రూపమే! సృష్టికి అవతల, ఇవతల కూడా ఉన్నది అతడే! అతడు అనంతుడు. ఆద్యంతాలు లేనివాడు. సృష్టియంతా అతని రూపమే కనుక సృష్టిలోని ఏ రూపాన్నయినా మనం అతని ప్రతీకగా, ప్రతినిధిగా స్వీకరించవచ్చు. ఆ మూర్తిని, ఆ నామరూపాలను దైవస్వరూపంగా మనం ఆరాధించవచ్చు. అలా మన ఆరాధనను ప్రారంభించవచ్చు. అయితే అది ప్రారంభం మాత్రమే అని మనం గుర్తెరిగి ఉండాలి. ఒకసారి ప్రారంభమయిన తరువాత అది ముందుకు సాగాలి! అనగా ఏ మూర్తిని మనం ఉపాసిస్తున్నామో ఆ మూర్తిని మనం అంతటా చూడగలగాలి. ఆ మూర్తిలో మనం అంతనూ చూడగలగాలి. ఆ మూర్తి కానిది ఇంకేమీ లేదు, అన్న అనుభూతి మనకు కలిగి స్థిరపడాలి. అప్పుడు అనన్యచింతన అవుతుంది. ఉన్నది ఒక్కడే. అన్యము లేదు. అనగా ఇతరమన్నది ఇకలేదు అని స్పష్టమవుతుంది.

ఇలాంటి ఈ ఉపాసన ఏ కొద్దిసేపో నిర్వహింపబడవలసినది కాదు. దేవుని ముందు కూర్చున్న ఆ కాసేపు ఇలాంటి అనుభూతి కలిగితే చాలదు. దేవుని ముందు కూర్చోవడం. దేవతార్చన అన్నది ఉపాసనకు దోహదం కావాలి తప్ప ఉపాసన అంటే అది మాత్రమే కారాదు. ఇది నిరంతరం సాగాలి. అఖండంగా సాగాలి. కనుకనే జరుగవలసినది పర్యుపాసనము అని చెప్పబడినది. **జీవితంలో ఉపాసన కాదు. జీవితంతో ఉపాసన జరగాలి. ఉపాసనలో మన జీవితం నడయాడాలి. మన జీవితమే మన ఉపాసన కావాలి. మన జీవితమే ఒక దేవతార్చనగా రూపొందాలి.** జీవిత నిర్వహణమే దేవునకు ఒక నిండైన పూజ కావాలి. మనంచేసే నిత్యదేవతార్చన, అనుష్ఠానం అందుకు కావలసిన దోహదాన్ని మనకు అందించాలి. అందుకు కావలసిన నేపథ్యాన్ని మనకు రూపొందించాలి! అందుకు కావలసిన శిక్షణను మనకు అనుగ్రహించాలి.

అనన్యచింతన అనేది ఎలా జరగాలి అన్నది భాగవతంలోని ప్రహ్లాదుని చరిత్రలో మనకు చక్కగా ఉపదేశింపబడనది. దినచర్యను దైవారాధనగా రూపొందించుకోవడమన్నది ఎలాగో ప్రహ్లాదుడు మనకు చూపిస్తున్నాడు చూడండి.

*పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషింపుచున్ హాసలీ*
*లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత*
*శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం*
*ధానుండై మఱచెన్ సురారి సుతుఁడేత ద్విశ్వమున్ భూపరా ।*






‘హరి’ అన్న ఎరుక సహజమయ్యింది. పుష్పానికి పరిమళంలా, చంద్రునికి వెలుగులా. తండ్రికి నచ్చలేదు – తనయుడు శత్రువయ్యాడు. మదపుటేనుగులతో తొక్కిస్తానంటే “మంచిది – హరి రూపమే కదా అది” సరేనన్నాడు. కీకారణ్యంలో కొండలమీదనుంచి విసిరి పారేయమన్నాడు తండ్రి. ఆహా! సర్వమూ హరి కళామయమే కదా. అణువణువును ఆనందంతో ఆస్వాదిస్తాను, సరే, మీ ఆజ్ఞ అన్నాడు. ఇలా ఏం చేసినా, ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా, అమృతమిచ్చినా, విషం సేవించమన్నా, ఏం జరిగినా ‘హరి’ అన్న ఎరుకలో ఉండిపోయాడు. అనుక్షణం తాను ద్వేషిస్తున్నా, తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నా – సదా ప్రేమనే వర్షిస్తున్నాడంటే అది ‘హరి’ తప్ప వేరొకరు కాదని అవగతమయ్యింది – ప్రహ్లాదునిలో హరి ‘ఎరుక’ ప్రస్ఫుటమయ్యింది హిరణ్యకశిపునికి.

ఏనాడైతే సాయిదృష్టి సదా మనమీదనే ఉన్నదన్న ఎరుక సహజమవుతుందో ఆనాడు మన బ్రతుకు ఆయన చరణాల చెంత వసివాడని పూజాపుష్పమవుతుంది. కష్టంలోనూ, సుఖంలోనూ.. క్షమించాలి. ఇక రెండు లేవు. ప్రతిదీ ఆయన అనుగ్రహమే! మిగిలేది కేవలం..కేవలం..కేవలం.. ఆనందమే! దేబరింపుల దైన్యపు ముఖాలు కానరావు, ప్రతీ చోటు ఒక విరబూసిన ఆనందపు తావే!

**సద్గురువనే ‘సవ్వడి’లో ఆనందపు ‘మువ్వలు’ :** ఎరుక మరుపుల ఏరువాకలో ఎటు పోతామోనన్న భయం మనలో ఉంటుందేమోనన్న ఆలోచన రాగానే సౌఖ్యం చిక్కాక నా భక్తులు నన్ను ఆశ్రయిస్తారన్న సాయి అభయం గుర్తురాక మానదు. ఆయన సామ్రాజ్యంలో ‘లేమి’కి చోటు లేదు. ‘చెలిమి’కి తప్ప. తన నుండి విడివడిన ప్రతి జీవి మరల తనను చేరేంతవరకు సద్గురు అవతార కార్యం కొనసాగుతూనే ఉంటుంది. ఒకరు ముందు–ఒకరు వెనుక అంతే! ఆయనతో చేరిక మాత్రం తథ్యం. అప్పటి వరకు “నేనే దైవం, నేనే శిరిడీలోనూ, సర్వత్రాకూడా ఉంటాను. సర్వ జగత్తూ నాలోనే ఉన్నది. కనిపించేదంతా కలసి నేను. నా ఆజ్ఞ లేక ఆకైనా కదలదు” అన్న శ్రీసాయి మాటలు ‘ఎరుక’ రూపంలో గురుతు ఉన్నంత వరకు, మనలో ఆ ప్రజ్ఞ సహజమయ్యేంత వరకు ప్రయత్నిస్తూనే ఉందాం. (మనమందరం బాబా తోటలో పువ్వులం. ప్రతి మొక్క, ప్రతి పువ్వు – తనదైన రీతిలో తనకు తగిన సమయంలో, తనదైన తియ్యదనంతో విరబూస్తుంది. –శ్రీబాబూజీ)

లీలామానుషుడు శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి వెన్నను దొంగిలించేవాడు. తనతో తన వారిని తోడ్కొని గోపకాంతల ఇళ్లలో వేనోళ్ల వెన్నను అందించేవాడు. యశోదకు ‘వెన్నదొంగ’ విశేషాలను ఫిర్యాదు చేసారు గోపకాంతలు – ‘నాకు తెలియదన్నాడు’ లీలా విగ్రహుడు. ఇక లాభం లేదని, వెన్న ముంతలకు మువ్వలు కట్టారు గోపకాంతలు. మువ్వలు సవ్వడి చేయగ – వెన్న దొంగలను కట్టడి




చేయగ – అంటూ! కృష్ణుడొచ్చాడు – మువ్వలకు చెప్పాడు, నేను నా స్నేహితులకు వెన్న అందించేంతవరకు సవ్వడి చేయొద్దని. ఆహా! ఏమీ మా భాగ్యమంటూ కృష్ణుడు – గోపబాలురందరి నోళ్ళలో వెన్నను ఉంచేంత వరకు ఏ సవ్వడీ చేయలేదు. చివరకు కృష్ణుని వంతు. కృష్ణుడు వెన్నను స్వీకరించగానే మువ్వల సవ్వడి సుస్వరమయ్యింది. గోపకాంతలొచ్చి గోపబాలురను కట్టడించారు. కృష్ణుడన్నాడు "ఏం సవ్వడి చేసారని" – "భగవంతునికి పదార్ధము ప్రసాదమైన క్షణాన మాకిది సంబరము – అప్రయత్నముగా మా ఘంటారావము సహజము" అన్నవి మువ్వలు. కృష్ణుడే చెప్పినా సంభాళించుకోలేనంత సహజమైన ప్రేమ మువ్వలది.

సద్గురు ప్రేమ సామ్రాజ్యంలో – సదా ఆయన దృష్టి మనమీదనే ఉన్నదన్న ఎరుకలో, ఎరుకతో సహచర్యం చేద్దాం. సమున్నతంగా జీవిద్దాం. తప్పక మన ఆలోచనా విధానం మారుతుంది. తద్వారా మన ప్రవర్తన (ఆచరణ) మారుతుంది. పరివ్తన కలుగుతుంది. సందేహం లేదు. (మనం ఒక పూదోటలో నడుస్తున్నప్పుడు పువ్వులు తాజాగా ఉంటే కాసేపు నిలబడి చూడాలని అనుకోవడం సహజం. ఆ పూలలోని తాజాదనం పోతే ఇక అక్కడ చూడటానికి ఏముంటుంది? అందుకని మీరు ఆ వాడిపోయిన పువ్వుల్లా ఉండవద్దు. ఎప్పుడూ తాజాదనాన్ని నిలుపుకోండి. అప్పుడే, ఆగి మిమ్మల్ని చూసేలా బాబా చేస్తారు. ఎందుకంటే నేను మీలో చూసేది ఆ తాజాదనాన్ని, అలా వికసించడాన్ని, ఆ సారాన్నే, ఆ పరిమళాన్నే. – శ్రీబాబూజీ). చివరగా ఈ కొత్త సంవత్సరంలో సద్గురువన్న 'ఎరుక'ను సహజం చేసుకుందాం. "బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్ధం చేసుకొని (గుర్తెరిగి) ఆనందంగా ఉండటానికి ప్రయత్నించండి. అది ఆయన (బాబా) కృపా స్వరూపం. మీలో ప్రతి ఒక్కరిని బాబా ఎలా ఉంచారు, ఎక్కడ ఉంచారు (ఎలా మలచారు) ఆయన మీకు ఏమి ప్రసాదించారు అనేది మీలో ప్రతి ఒక్కరిలో నేను దర్శించుకుంటాను. మీరు ఇంకా ఎక్కువ కోరుకుంటే ఎక్కువ ఇస్తాను. కానీ బాబా ఇచ్చిన దానిని ఆనందంతో అనుభవించండి, ఆస్వాదించండి".

"బాబా అనే ఆనందంతో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం నేను చూస్తే నేనూ సంతోషపడతాను. బాబా అనే ప్రేమలో, ప్రేమ అనే ఆ ఆనందంతో ప్రకాశిస్తూ మీ అందరి ముఖారవిందాలు విప్పారి ఉంటాయి. బాబా మీవాడన్న నమ్మకము, నీవు బాబాకు చెందిన వాడవన్న అనన్యత్వము ఉన్న ఆ రాజసం ఉండాలి. మనమంతా శ్రీసాయినాథ్ మహరాజ్ కుమారులం, కుమార్తెలం. ఆయన మహరాజు (గురువుగారు నవ్వుతూ) మనమూ ఆ రాజవంశీకులమే. మనము రాకుమారులం, రాకుమార్తెలం".

గురువన్న గుర్తెరిగి జీవిద్దాం. 'అహం' గుర్తులు చెరిపి సద్గురు చరణాలలో ఐక్యమవుదాం.






"ఎదుటివ్యక్తి మీ పట్ల ఎలా ఉండాలని అనుకుంటున్నారో, మీరు కూడా అతనిపట్ల అలాగే ఉండండి!" –క్రీస్తు. మీరు ఎవరిపట్ల అయినా అలా ఉండగలరా? ఇంకొకరి జీవితంలో ఒక బహుమతిగా మారగలరా? ఒక వ్యక్తిని పూర్తిగా ప్రేమించి, వాళ్ళకి అత్యుత్తమమైన బహుమతిగా మారే అర్హతని కలిగి ఉండగలరా? మీరు వారిపట్ల ఉండే తీరునుబట్టికాక, వాళ్లు మీతో ఎలా ఉండగలుగుతారో అనేదాన్నిబట్టే మీ ప్రేమని అవతలివారు గ్రహించగలుగుతారు. **మీ ప్రేమలో, దాని సువాసనలో మీరు ప్రేమించే వ్యక్తిని పువ్వులా వికసించనివ్వండి. ఇది గురుపథం. గురు సాంప్రదాయం. గురునితో సంబంధ బాంధవ్యం ఇది. సేకరణ : గురుకృప**

## అనన్య చింతన నీది – యోగక్షేమాలు నావి!

**అనన్యా శ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

ఎవరు నన్ను అనన్యచింతన కలిగి ఆరాధిస్తారో, వారు నిత్యాభీయుక్తులవుతున్నారు. అట్టి వారి యోగక్షేమాలను నేను చూచుకుంటాను. ఆ బాధ్యతను నేను వహిస్తాను. తమను గూర్చి తాము ఆలోచించుకోవలసిన స్థితి అన్నది వారికి లేకుండా, రాకుండా నేను కాచుకుంటాను.

అనన్య చింతన అంటే ఏమిటి? 'నేను' తప్ప అన్యము లేదని అనుభవానికి రావడం, ఆచరణలో ఆ అనుభూతి అఖండంగా నిలబడటం. మామూలుగా లోకంలో అనన్యచింత అన్నప్పుడు దేవతామూర్తులలోనో, మహనీయులలోనో ఏదో ఒక మూర్తిని విశ్వసించి, ఆ మూర్తిని మాత్రమే స్మరిస్తూ, ఆ అర్చనలో పాల్గొంటూ ఉండటమనే అర్ధం ఉన్నది. అలా తమకు నచ్చిన మూర్తియందు కూర్చుండిపోయేవారు కూడ ఉన్నారు. ఆ స్మరణలో వీలైనంత ఎక్కువసేపు ఉండిపోయే వారు కూడా ఉన్నారు. ఇది చింతనకు ప్రారంభమవుతుంది కాని అనన్యచింతన అంటే ఇది మాత్రమే కాదు. ఇంత మాత్రమే కాదు.

దేవతామూర్తులలోగాని, దేవుని అంశంతో దిగివచ్చిన మహనీయులలోగాని మనకు నచ్చిన మూర్తిని మనం స్మరించవచ్చు. మన మనసు మెచ్చిన మూర్తిని మనం ఉపాసించవచ్చు. అయితే ఆ అర్చన క్రమంగా అనన్యచింతనగా రూపొందాలి. ఆ మూర్తినే మనం అంతటా చూడగలగాలి. అన్నిటా చూడగలగాలి. సకల దేవతామూర్తులలోను, మహనీయులలోను మనకు నచ్చిన ఆ మూర్తి మనకు పొడగడుతూ (దర్శనమవుతూ) ఉండాలి. అతడు, మిగిలినవారు అన్నభావన మనకుండకూడదు. ఆ భావన రాకూడదు. నిజానికి మిగిలినవారు అన్నవారు లేరు. అలా మిగలరు. అది మన భావన




## గురునితోడి సంబంధం

### ఇంకొకరికి అత్యుత్తమమైన బహుమతిగా రూపొందండి

అడుగడుక్కీ సంజాయిషీలు ఇవ్వక్కర్లేని సంబంధం ఒకటి నాకు కావాలి. ప్రతిదానికీ సంజాయిషీ ఇచ్చుకోవడం కన్నా, అలసట పెంచేది మరేదీ లేదు. శారీరకంగా కలిగే అలసటకన్నా మానసికంగా అలసిపోవడం మీ శక్తిని ఎక్కువగా హరిస్తుంది. అందుచేత, నేను నమ్మకం పెట్టుకొని, స్వేచ్ఛని అనుభవించే ఒక సంబంధం కోసం వెతుకుతున్నాను.

నేను చేసిన పనులకి నన్ను దోషిగా నిలబెట్టని సంబంధం కావాలి. నాలో కొన్ని బలాలు, కొన్ని బలహీనతలూ ఉన్నమాట నిజమే. నేను వెతికే మనిషి నా బలహీనతలని రెచ్చగొడుతూ, పురిగొల్పుతూ ఉండకూడదు. నాలో ఉండే మంచి గుణాలని ఎప్పుడూ బైటికి తీసుకురాగల సంబంధం మాత్రమే నేను కోరుకుంటున్నాను.

నిన్న నేను చేసిన తప్పులకి ఈ రోజు నన్ను దోషిగా పరిగణించని ఒక మనిషితో నాకు సంబంధం కావాలి. ఎంతైనా మనిషిని కాబట్టి, తప్పులు అప్పుడప్పుడూ చెయ్యడం సహజమే. నా తప్పులన్నిటినీ చిట్టా రాసిపెట్టుకునే మనిషి నాకక్కర్లేదు. నిన్న జరిగిన పోట్లాట వల్ల ఈ రోజు మాటల్లేకుండా చేసేట్టు, నాతో విరోధం పెట్టుకోని వ్యక్తితో నాకు సంబంధం కావాలి... నిన్న అనేది నిన్నటితో ముగిసిపోయింది.

ప్రతిసారీ నేనే చొరవ తీసుకోవాల్సిరాని సంబంధం నాకు కావాలి. నేను పారదర్శకంగా ఉండగల సంబంధం కావాలి. సంబంధాన్ని కొనసాగించేందుకూ, నిలుపుకునేందుకు నా ఇష్టాయిష్టాలని మార్చుకోవక్కర్లేని సంబంధం కావాలి. నా ఆత్మగౌరవానికి హాని చెయ్యని సంబంధం నాకు కావాలి. నన్ను మారమని, మరో మనిషిలా ఉండమని అడగని సంబంధం కావాలి. (Don't compare with others - Saibaba) నీ ఇష్టానికనుగుణంగానే నడిపించి, నీ జీవితంలో సౌఖ్యం చిక్కాక నన్ను అనుసరించి, గమ్యం చేరుకోగలరు అని బాబా అంటారు. కనుక మనం చేయవలసినది ఇక కృతజ్ఞతలు చెప్పుకోవడమే. నిజమైన కృతజ్ఞత అంటే ఆచరణే, వారు నడిచి చూపిన బాటన నడవడమే. ఒక్కడినే ఉన్నప్పటికన్నా ఎక్కువగా నేను నేనుగా ఉన్నానన్న భావన కలిగించే వ్యక్తితో సంబంధం కావాలి.

మా అమ్మ గర్భంలో మళ్ళీ ఉన్నట్లు అనిపించగల ఒక సంబంధం నాకు కావాలి... ఆ మనిషితో ఉన్నప్పుడు నా మనసుకి అప్పుడే పుట్టానని అనిపించాలి. మీకు ఇప్పటికే అటువంటి వానితో సంబంధం ఉంటే... మోకాళ్ళ మీద వంగి కృతజ్ఞతలు తెలపండి. ఎందుకంటే జీవితం మీకివ్వగల బహుమానాల్లో దాన్ని మించినది లేదు. అటువంటి వానితో సంబంధం ఒక గొప్ప వరం లాంటిది.








## మృత్యుభయం *డిసెంబర్ 2014*



**గురువుగారు :** మీరు ఒక్క విషయాన్ని, అంటే – మన జీవితాలు ఎంత తాత్కాలికమైనవో, ఎంత క్షణభంగురమైనవో, ఎంత చిన్నవో అని గుర్తించి, అది నగ్నసత్యమనే విషయాన్ని మీరు అంగీకరించగలిగితే చాలా చాలా సమస్యలు పరిష్కారమైపోతాయి. ఆ విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. కానీ ఎవ్వరూ ఆ విషయాన్ని గ్రహించరు. అందరూ వాళ్ళు చేసే ప్రతి పనీ అదేదో శాశ్వతంగా ఉంటుంది అన్నట్లుగా చేస్తుంటారు. దీంట్లో ఏమన్నా నిజముందా? అలా శాశ్వతం అనుకోవడంలో అణుమాత్రమైనా సత్యముందా? మనం దానిని సరిగ్గా అర్థం చేసుకోగలిగితే కనీసం మనవరకైనా చాలా సమస్యలు తీరిపోతాయి. జీవితం పట్ల మన దృక్పథం మొత్తం మారిపోతుంది. కాని మనమేమో, మనం శాశ్వతమన్నట్లు, ప్రక్కన వాళ్ళు శాశ్వతమన్నట్లు, వస్తువులూ, విషయాలూ శాశ్వతమన్నట్లు బ్రతుకుతుంటాం. కానీ ఎంతకాలం? మనకింకా వంద సంవత్సరాలో, మరో వెయ్యి సంవత్సరాలో జీవితం ఉందనుకుంటాం. మనకు కోపతాపాలు కలిగించే రకరకాల విషయాలు మన ఆనందానికి లేదా దుఃఖానికి ఏ విధంగా దోహదపడుతున్నాయి?

భాగవతంలో "కారే రాజులు రాజ్యముల్ గలుగవే? వారేరీ సిరి మూటఁగట్టుకొని పోవంజాలరే?" అనే పద్యముంది. ఎందరో రాజులు మహా మహా సామ్రాజ్యాలను ఏలారు. వారంతా ఇప్పుడేరి? వాళ్ళు పోయేటప్పుడు వారి సామ్రాజ్యాలను వారితో పట్టుకెళ్ళగలిగారా? ఈ విషయం తెలిసీ చరిత్ర చదువుకుని కూడా మీరింకా శాశ్వతంగా ఉంటారనుకుంటున్నారు. బహుశా ఇందుకేనేమో నాకు చరిత్ర అంటే ఇష్టం – అది నాకు ఇష్టమైన సబ్జెక్టు. ఎందుకంటే చరిత్ర మనకు, ప్రతి విషయం ఎంత అనిత్యమో అశాశ్వతమో తెలియచేస్తుంది. నాకు చరిత్ర ఒక వేదం, ఉపనిషత్తు, పురాణం, ఆధ్యాత్మిక తత్వం వంటిది. మనకు జీవితం యొక్క అశాశ్వతతత్వం గురించి చరిత్ర కన్నా బాగా బోధించేది ఏముంటుంది? ఒకసారి ఆలోచించండి.

ఈ కాస్త సమయంలో మనం ఎన్నో సమస్యలు సృష్టించుకుంటాం. సంబంధబాంధవ్యాలలో




సమస్యలు, ఒకరితో ఒకరు పోట్లాడుకోవడాలు, ఇలాంటివెన్నో. భారీ ఎత్తున డబ్బులు సంపాదించడానికి, ఆస్తిపాస్తులు కూడబెట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. స్థలాలు కొనడం, ఇళ్ళు కట్టుకోవడం, వాటన్నింటినీ మీ సృష్టిలాగా చూడటం, వాటితో అనుబంధాన్ని పెంచుకోవడం – ఇవన్నీ నిజంగా అవసరమా? నిజంగా అది తెలివైన పనేనా?నాకు మిగతా అన్నింటికన్నా, అన్నీ అశాశ్వతం అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవడం, ఆ ఎరుకలో ఉండటం సరిపోతుందనిపిస్తుంది. మిగతా శాస్త్రాలేవీ అవసరం లేదు, ఈ విషయం తెలియజేయడానికి మీకు ఏ గురువూ అవసరం లేదు – ఈ సత్యం కంటి ముందే కనిపిస్తుంది. దానిపట్ల ఎరుకతో ఉంటే ఈ ప్రపంచం పట్ల, విషయాలపట్ల, మీ వ్యక్తిత్వం పట్ల మీ దృక్పథం ఎలా మారుతుందో గమనించండి. మనం ఎంత సమయం వృథా చేస్తున్నాము! దానిని వెనుకకు తీసుకురాగలరా? ముఖ్యంగా మీకు సంతోషం కలిగించని విషయాలలో మీ టైమ్‌ను వృథా చేసుకోవద్దు. "మీరు సమయాన్ని వృథా చేసుకోవద్దు, మిమ్మల్ని మీరు బాబాకు అంకితం చేసుకోండి" అని నేను చెప్పడంలేదు. మీ దృష్టిలో ఏది ఆనందం అనుకుంటున్నారో, కనీసం అలా అయినా ఉండటానికి ప్రయత్నించండి. మీరు ఇండియా నుండి రెండు మూడు రోజులలో మీమీ దేశాలకు వెళ్తారనగా మీరెలా ఉంటారు? "సత్సంగం చేసుకోవాలి, దర్శనం చేసుకోవాలి, ఎంత వీలైతే అంతగా ఉపయోగపెట్టుకోవాలి" అని అనుకుంటారు. మీరు ఇలా అనుకోవడానికి కారణం మీరు వెళ్లిపోతున్నారని మీకు తెలుసు. కానీ మన జీవితం మొత్తం ఒక ప్రయాణమని, మనం ఎప్పుడు వెళ్లిపోవాలో నిర్ణయం అయిపోయిందన్న విషయాన్ని మీరు మర్చిపోతున్నారు. దాని సంగతేంటి?

**భక్తుడు** : గురువుగారూ! భయానికి మూలం ఏమిటి?

**గురువుగారు :** మీరు బాగా ప్రేమించేదానిని కోల్పోతారనే సందేహం వచ్చినప్పుడు భయం కలుగుతుంది. అది ప్రేమ నుండే ఉద్భవిస్తుంది. మనకుండే భయాలలో ప్రాథమికమైనది మరణభయం. ఈ మరణ భయానికి కూడా కారణం మీ జీవితంపట్ల మీకు గల ప్రేమ. మీరు మీ జీవితాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. మన దృష్టిలో మరణం అంటే మనం అనుకునే ఈ అస్తిత్వం, ఈ జీవితం ముగిసిపోవడం; ఆపైన మనమంటూ ఉండటం ఉండదు. మన జీవితాన్ని మనం ఎంతగానో ప్రేమించడం వలన మనకలా జరగడం ఇష్టముండదు. మన జీవితం ఆనందంగా ఉన్నా, దుఃఖంగా ఉన్నా మనమది కొనసాగాలని కోరుకుంటాం. జీవితం పట్ల ఈ ప్రేమ, జీవించాలనే కోరిక ప్రతి మనిషిలో ప్రాథమికంగా ఉంటుంది. అన్ని భయాలు, రోజువారీ జీవితంలోని భయాలు సైతం జీవితం పట్ల మనకు గల ప్రేమ నుండే పుడతాయి – మనం దేనినైతే అత్యంత ఎక్కువగా ప్రేమిస్తామో






క్లాసు జరిగినంత సేపూ తీస్తూనే ఉంటాయి. ఇక బోర్డుపైన పేపరు బోర్డు అమర్చబడి ఉంటుంది. ఇలా వ్రాస్తూ ఉంటే అలా చుట్టుకుంటూ ఉంటుంది అది. ఆ చుట్టుకుంటున్న చుట్టలన్నింటినీ శ్రద్ధగా ప్రిజర్వ్ చేస్తారు. వాళ్ళు ఇప్పటికిన్ని సంవత్సరాలుగాను ఇలా చేస్తూనే ఉన్నారు. ప్రసంగం కాగానే కొంతసేపు ప్రశ్నోత్తరాలకని కేటాయిస్తారు. ఆనాటి ప్రసంగంలోని అంశాలను గూర్చి అడగాలనుకున్నవి అడిగి, శ్రద్ధగా వాటిని టేప్ చేస్తారు. ఇంతటితో ఊరుకోరు. ఆ టేప్‌లను వింటూ టైపు చేసి, ఆ కాగితాలను మనకీ, వారితో శృతికలిపిన మిగిలిన ఆధ్యాత్మిక సంస్థలకూ అందచేస్తూ ఉంటారు. అందులో కొందరు టైపు చేయడంతో ఆగకుండా తమతమ భాషలోనికి అనువాదం చేస్తూ ఉంటారు. ఇలా ఈ రోజున ప్రధాన భాషలన్నింటిలోనూ మన ప్రవచనాలు, గ్రంథాలు అనువాదం చేయబడి ఆయా దేశాల యోగ విద్యాలయాల్లో అధ్యయనం చేయబడుతున్నాయి. ఇలా ఉంటుంది వారి కృషి. "మైలైట్" అని మనకొక పత్రిక ఉంది. అది మీకు తెలుసు. మన సంస్థ నుండి వస్తున్న పత్రికే అయినా మనవాళ్లలో దాన్ని ఉపయోగించుకునే వాళ్లు తక్కువ. వాళ్ళేం చేసారో తెలుసునా? మైలైట్‌ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తూ అందులో సీరియల్‌గా వస్తున్న రచనలను ఇతర భాషలలోనికి ఎప్పటికప్పుడు అనువాదం చేస్తున్నారు.

ఈ మధ్యనే అందులోని విష్ణుపురాణ వ్యాఖ్యానానికి చక్కని జర్మన్ అనువాదాన్ని నాకు అందించారు. ఆ విష్ణుపురాణ వివరణలోని సాంకేతిక పదాలను సేకరించి దానికి వివరణ వ్రాయించి పంపవలసిందిగా నాకు అందచేసారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు. అయితే అంతా మంచే చెబుతున్నారు వాళ్ళ గురించి. వాళ్ళలో లోపాలు లేవా అని మీరు అనవచ్చు. ఎందుకు ఉండవు, అవి వాళ్ళకు చెబుతాను. వాళ్ళ దగ్గర మీ లోపాలు చెప్పను. మీలో ఉన్న మంచి లక్షణాలన్నీ వాళ్ళకు చెప్పి వాళ్ళు ఎదిగేటట్లు చూస్తాను. ప్రాక్–పశ్చిమాల మధ్య సమన్వయ సారధిగా ఇది నా కర్తవ్యం. కనుక ఇంతటి ఆదరాభిమానాలతో మీరందరూ మీమీ ఒత్తిడి జీవితాల నుండి ఇక్కడకు చేరుకున్నారు. మీ హృదయాలనే పూలుగా చేసి, దండలుగా రూపొందించి నన్ను ముంచెత్తారు. మీ శ్రేయోభిలాషిగా ఆ సందర్భంలో ఆత్మ పరిశీలనకు పనికి వచ్చే విధంగా కొన్ని అంశాలను నేను ముచ్చటించాను. భారతీయులు త్వరత్వరగా ఎదిగి రావాలనీ, చేసి పెడతానని ఒప్పుకుని వచ్చిన పనులు చాలా ఉన్నాయి. మిమ్మల్ని కలుపుకొని ఆ పనులు నేను పూర్తి చేయవలసి ఉంది. మనందరం కలసి చేయవలసిన పనులివి. ఈ కర్తవ్య నిర్వహణలో మనం పరిపూర్ణతను సాధించగలము అని ఆశిస్తూ.... మననుండి కోరుతున్న దానిని మనం అందించగలగాలని నేను కోరుకుంటున్నాను. **– అక్షరాలలో అనుభూతులు నుంచి**




ఇవాళ మనం ప్రొద్దున్నే లేవడానికి బద్ధకిస్తున్నాం. తెల్లవారుఝామునే లేచి, తగుమాత్రంగా ఆసనాలు అవీ వేసుకొని, శరీరానికి, మనస్సుకూ శృతి కుదిర్చి, వాటిని చైతన్యవంతం చేసి, ఆపైన స్నానాధికాలు పూర్తిచేసి, దైవధ్యానంలో మిగిలిన సాధనను కొనసాగించి అటుపైన పవిత్రమైన ఆ ఉపాధితో కర్తవ్యనిర్వహణలోనికి ప్రవేశించడం ఒకప్పటి మన అలవాటు. ఇవాళ మనలో ఎక్కువమందిమి వాటన్నింటినీ వదిలేసుకున్నాం. ఆసనాలు మరచిపోయాం. పెద్దలు అందిస్తూ వచ్చిన సింహాసనాలను, దేవుడి విగ్రహాలను, సాలగ్రామాలను ఏ దేవాలయాలకో అప్పగించి చేతులు దులుపుకుంటున్నాం. (భగవంతరావు క్షీర సాగరుని వృత్తాంతం. –సాయిసచ్చరిత్ర పే. 34). మనను మనం పవిత్రీకరించుకోకుండానే విధి నిర్వహణలోనికి వెళుతున్నాం. విధిలేక పనిచేస్తున్నాం. విధిని నిందించుకుంటూ కాలాన్ని వెళ్లబుచ్చుతున్నాం. కాని మొన్న మొన్నటిదాకా యాంత్రికంగా పనిచేసిన ఆ దేశాలలో ఇపుడేం చేస్తున్నారో తెలుసునా? ఊరూరా యోగ విద్యాలయాలు నెలకొల్పుకుంటున్నారు. మొత్తం మీద ఒకప్పటి మన దినచర్యను తమ దినచర్యగా రూపొందించుకొనేటందుకై దీక్షతో వారు కృషి చేస్తున్నారు. ఆధునికమైన సౌకర్యాలను, శాస్త్ర విజ్ఞానాన్ని యోగశిక్షణలో చక్కగా వినియోగించుకుంటున్నారు. ఆధునిక విజ్ఞానమంతా వాళ్లకందుకు వినియోగింపబడుతుంది. టేప్ రికార్డర్లు, టి.వి. ఛానల్స్, వీడియో, రేడియోలు అన్నింటినీ ఈ దివ్య సాధనకోసం రకరకాలుగా వాళ్ళు వినియోగిస్తున్నారు. మనమేమో ఆయా పరికరాలనన్నింటినీ కొని పెట్టుకొని, పట్టుకొని, చూసుకొని మురిసిపోతున్నాం. వాళ్ళకవి సౌకర్యాలు. మనకవి స్థోమతకు చిహ్నాలు. చూసారా! ద్రష్టల మధ్య తేడా ఎలాంటిదో? ఈ అంశం వంటపట్టడానికి కొన్ని దృశ్యాలు మీ ముందుంచుతాను. మనం ఆధ్యాత్మిక ప్రసంగాలను కాలక్షేపంగా గడిపివచ్చేటందుకు అలవాటు పడుతున్న వాళ్లం. వాళ్లు అలా కాదు. ఇష్టం లేకపోతే రాడు. వస్తే శ్రద్ధగా వింటాడు. అర్థం కాకపోతే అర్థం అయినట్లు నటించడు. అడిగి మరీ తెలుసుకుంటాడు. అర్థమయిన దాన్ని ఆచరణలోనికి తెచ్చుకునేవరకు విశ్రమించడు. {తెలిసిన దాన్ని ఆచరించడం రాముని (సురుల) సాంప్రదాయం. తెలిసిన దాన్ని ఆచరించకపోవడం రావణాసురుని (అసురుల) విధానం.మరి మనం ఎవరమో మనకే తెలుస్తున్నది. ఆలోచించుకుంటే} అందుకు సిద్ధమయితేనే వాడు అడుగుపెడతాడు. ప్రసంగానికి వచ్చిన అన్ని వందలమందీ ఒక్కొక్కరు ఒక్కొక్క టేప్‌రికార్డర్ తెచ్చుకుంటారు. ప్రసంగంతో పాటే టేప్‌రికార్డర్లన్నీ ఒకేసారి ఆన్ అవుతాయి. సరిగా అరగంట అయ్యేసరికి అన్ని వందల టేప్‌రికార్డర్లు ఠక్కున లేస్తాయి. అది గమనించి ఒక అరనిమిషం ఆగేవాణ్ణి. మళ్ళీ మొదలు, ఒక ప్రక్కనుండి ఈ ప్రసంగం మొత్తాన్ని వీడియో తీసే కార్యక్రమం నడుస్తూ ఉంటుంది. రెండు మూడు వైపుల నుండి రెండు మూడు కెమెరాలు






దానిని కోల్పోవలసి వస్తుందనే ఆలోచన నుండే భయాలు కలుగుతాయి.

**భక్తుడు** : గురువుగారూ! ఈ మధ్య మాలో చాలామందికి బాగా దగ్గరైన కుటుంబసభ్యులో, స్నేహితులో మరణించడం మూలాన మేము మరణమనే వాస్తవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. మరణంపట్ల మన దృక్పథం, ఆలోచనావిధానం ఎలా ఉంటే మంచిదని మీ ఉద్దేశ్యం?

**గురువుగారు :** నేనేమంటానంటే, మరణం పట్ల మన దృక్పథం ఎలా ఉండాలి అని ఆలోచించే దానికన్నా, ముందు మీ జీవితం పట్ల మీ దృక్పథం గురించి జాగ్రత్త వహించండి.

**భక్తుడు** : కానీ, ఒకవేళ జీవితం అంత ఆకర్షణీయంగా లేకపోతే?

**గురువుగారు :** మరి మరణం అంత ఆకర్షణీయంగా ఉందా? (గురువుగారు నవ్వుతూ..) అది ఆకర్షణీయమైనదా కాదా అనేది ముఖ్యం కాదు. జీవించడం, మరణించడం అనేవి మనకు అనివార్యంగా అనుభవమయ్యే రెండు విషయాలు. ఒకటి ఇప్పుడు మన అనుభవంలో ఉంది, మరొకటి మనకు భవిష్యత్తులో అనుభవంలోకి వస్తుంది. మనకు మన జీవితం అనేది తప్పనిసరి. అంతేకదా? (గురువుగారు నవ్వుతూ..) మరణం కూడా తప్పనిసరి కాబోతోంది. ఇప్పుడు జీవితం మీ చేతుల్లో ఉంది కాబట్టి జీవితం గురించి ఆలోచించండి.

**భక్తుడు** : మనకు బాగా దగ్గరైన వ్యక్తి ఎంతో బాధపడుతుంటే, ఆ క్రమంలో వారికి సహాయం చేయడానికి, ఆసరాగా నిలబడడానికి మేమేమైనా చెయ్యగలమా?

**గురువుగారు :** అది మీకు ఆ వ్యక్తితో గల అనుబంధం మీద ఆధారపడి ఉంటుంది. మీరు అతనికి ఎలా సాయం చెయ్యాలో చెప్పే ప్రత్యేకమైన సిద్ధాంతమేమీ లేదు. అది వ్యక్తిగతమైనది. మీరు ఎలా సాయం చెయ్యాలనుకుంటున్నారు, ఎటువంటి సాయం చెయ్యాలనుకుంటున్నారు అనేది వ్యక్తికీ, వ్యక్తికీ మారుతూ ఉంటుంది. “ఆందోళనవద్దు” అని చెప్పడం కేవలం మాటలు చెప్పడమే అవుతుంది, తద్వారా మీరు నిజానికి ఎటువంటి సాయం చెయ్యడం లేదు. మరణమనేది అనివార్యం. మరణభయం మీదే జీవితం మొత్తం ఆధారపడివుంది అంటారు. కానీ నేనలా చూడను. మానవ జీవితానికి, అస్తిత్వానికి ప్రాథమికమైనది – జీవితంపట్ల మనిషికి ఉండే ప్రేమ. మన జీవితాన్ని మనం ఎంతగా ప్రేమిస్తామంటే అది అంతమవుతుందనే ఆలోచనే మనకు చాలా భయాన్ని కలిగిస్తుంది. మనకు అంత ఇష్టమైన దానిపట్ల మనం జాగ్రత్త వహిస్తున్నామా లేక మనం భయపడే దాని గురించే (మరణం) ఆలోచిస్తున్నామా? మనం మన జీవితం గురించి పూర్తి జాగ్రత్త వహించి, పరిపూర్ణమైన ఆనందంతో జీవిస్తే మనం మరణం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే




అది ఎలాగూ తప్పదు. జీవించడమూ తప్పదు, మనం దీనిని కూడా తప్పించుకోలేము. ఎందుకు తప్పదు అంటున్నానంటే, చాలామందిని "మీరు ఎందుకు జీవిస్తున్నారు" అని అడిగితే – వారు నిజాయితీగా చెప్పగలిగిన సమాధానం, "నేనింకా చచ్చిపోలేదు కాబట్టి" అని. (గురువుగారు నవ్వుతూ) మనం అటువంటి విచారకరమైన స్థితిలో ఉండకూడదు. మన జీవితానికి అర్థం, ప్రయోజనం, పరిపూర్ణత్వాన్ని తెలుసుకుందాం. అంతేగానీ తప్పనిసరిగా సంభవించేదాన్ని అంగీకరించడం కాదు.

ఇప్పుడు మన అనుభవంలో ఉన్న జీవితం మన చేతిలో ఉన్న పక్షి వంటిది. భవిష్యత్తులో సంభవమయ్యే మరణమనేది పొదలో ఉన్న పక్షి వంటిది. మరణం గురించి మాట్లాడకుండా ముందు మన చేతిలో ఉన్న జీవితం గురించి జాగ్రత్తపడదాం. మన అనుభవంలో లేని మరణం గురించి మాట్లాడటం పొదచుట్టూ వెతకడంలా ఉంటుంది. జీవితం ఇప్పుడు ఇక్కడ ఉంది, అది మీ అనుభవం. దానిని ఉన్నతంగా చేసుకోవడమెలాగో, దాని నుండి ఎక్కువ ప్రయోజం ఎలా పొందాలో ఆలోచించండి. మరణం గురించిన ఆలోచనలతో బాధపడుతున్న వారికి ఈ విషయాలు చెప్పండి. వారు మరణం గురించి ఆలోచించకుండా ఉండటానికి ఇది చక్కటి సహాయమవుతుంది.

**భక్తుడు** : గురువుగారూ! మరణం కేవలం బాధను మాత్రమే కలిగించట్లేదు. జీవితతత్వాన్ని గురించి ప్రశ్నించుకునేలా, మన అనిశ్చితస్థితి గురించి ప్రశ్నించుకునేలా చేస్తోంది.

**గురువుగారు :** నేను చెప్పేదీ అదే. అది ఆ ప్రశ్నను రేకెత్తించాలి. అటువంటి అనిశ్చిత పరిస్థితిలో మనం ఏం చేస్తున్నాం? అనేది ఆ తరువాత వచ్చే ప్రశ్న. ఎవరి మరణమైనా, ముఖ్యంగా మనకు దగ్గరవాళ్ళ మరణమైనా మనలో అటువంటి విచారణను కలిగించాలి.

**భక్తుడు** : అంటే మనం మన జీవితంలో ఏంచేస్తున్నాం, సమయాన్ని ఎలా గడుపుతున్నాం అని (తరచి చూసుకోవాలని) మీ ఉద్దేశ్యమా?

**గురువుగారు :** అవును అదే నా ఉద్దేశ్యం.

సాధారణమైన భావోద్వేగాల పరంగా చూస్తే ఎవరైనా మనకు ప్రియమైనవాళ్ళు చనిపోతే బాధపడటమనేది ఎంతో సహజం. కానీ మనం మరణిస్తే బాధపడేవాళ్ళు ఎవరు? మనం మరణిస్తే బాధపడటానికి కనీసం ఒక్కరినైనా మిగుల్చుకోవడం మంచిదా, కాదా? దాని కోసం మనమేం చేస్తున్నాం?

**భక్తుడు** : మృత్యుముఖ్యంలో ఉన్నవారికి నేను ఇవ్వగలిగింది ఏమన్నా ఉందా?

**గురువుగారు :** నాకు తెలిసినంతవరకు మనం చెయ్యగలిగింది బాబాను ప్రార్థించటమే. ఒకవేళ






ఇవాళ పాశ్చాత్య దేశాలలో ప్రతి విశ్వవిద్యాలయంలోనూ సంస్కృత విభాగమున్నది. ఊరికే మనలాగ నామినల్‌గా ఉండటం కాదు. **(సంస్కృతమైతే సులభంగా వందకి వంద లేదా ఎక్కువ మార్కులొస్తాయని మాతృభాషని వదిలి వేయిస్తున్నారు తల్లిదండ్రులు. మనం దానిని ప్రోత్సహిస్తున్నాం. అది అలా పెరిగి తల్లిదండ్రులను వదిలేలా చేస్తున్నది అన్నది మరువద్దు. మార్కుల కోసం విద్యను మార్చాం. ఈ 'మార్కు'ఇజంలో విద్యార్థి అన్న అర్థం మరుగునపడింది.)** పేరుకు ఉండి ఏం లాభం? పేరు తెచ్చేటట్లు ఉండాలి గాని, అక్కడ ప్రతీ సంస్కృత విభాగంలో చిత్తశుద్ధితో కూడిన పరిశోధనలు దీక్షగా సాగుతున్నాయి. వేద శాస్త్రాలపైన, పురాణేతిహాసాలపైన విలువైన గ్రంథాలు ఎంతో అందమైన గెటప్‌తో వస్తున్నాయి. దేవతలు అంటే ఎవరు? పితృదేవతలు అంటే ఎవరు? రుద్రులు అంటే ఎవరు? ఆదిత్యులు అంటే ఎవరు? ఇలాంటి అంశాలన్నీ ఆ దేశాలలో ఈ సాధనలో ఉన్న యువకులందరూ అలవోకగా చెప్పగలిగి ఉంటారు. (సాయిపథం పిల్లవాడంటే అన్నీ చెప్పగలిగి ఉండాలి. – శ్రీబాబూజీ)

కానీ మనదేశంలో ఆధ్యాత్మికులుగా చెలామణి అవుతున్న వారిలో ఎందరు చెప్పగలరు? ఈ విషయం ఎందుకు చెబుతున్నానూ అంటే ఓ భారతీయుడా? ఈ గడ్డపైన నీవు పుట్టావు. కానీ నీ వారసత్వంలోని వైభవాన్నీ, శాస్త్రీయమైన బోధనూ, నీవు ఎంత వరకు గమనించగలిగావు. అని హెచ్చరించడానికి, బద్ధకస్తుడివై, అలసుడివై పొట్టకూటికే కాలం మొత్తాన్ని ఖర్చుపెట్టుకుంటున్న నిన్ను చూస్తే నాకు బాధ వేస్తోంది, జాలి వేస్తోంది, కోపం వస్తోంది. **చేయవలసింది చేస్తే రావలసింది అదే వస్తుంది. జీవిత కార్యాన్ని నిర్వహించడంలో నీవు నిమగ్నమై ఉండు ఇక జీవితావసరాలంటావా? అవి నిన్ను వెతుక్కుంటూ వస్తాయి.** ఏం? సముద్రం వైపుకు పరుగెత్తుకుంటూ వెళ్తున్న నదులని నీవు ఎప్పుడూ చూడలేదా? కర్తవ్యాన్ని విస్మరించినవాడే పొట్టకూటికై వెతుక్కోవలసిన స్థితిలో పెట్టబడతాడు. ఎప్పుడైతే ఆ స్థితికి దిగజారాడో ఇక వాడికి జీవితమే సమస్య. ఇవాళ మనం సమస్యలు, సమస్యలు అంటున్నాం. (జీవభార వాహకులమవుతున్నాం) అవి ఎందుకు చుట్టుముడుతున్నాయో ఇప్పుడైనా గ్రహించండి. జీవితాన్ని సద్వినియోగం చేస్తున్నవాడికి సమస్య అనేది ఉండదు. సద్వినియోగం చేయడం మానినవాడికి సమస్యలు తప్ప ఇంకేమీ ఉండవు. ఇదీ ఈ పవిత్ర భూమి ప్రపంచానికి అందిస్తూ వస్తున్న సందేశం. అందుకే దీన్ని ధర్మభూమి అన్నారు. కర్మభూమి అన్నారు. అలాంటి ఈ దివ్య సందేశాన్ని పెద్దలెందరో సకల దేశస్తులకూ అందిస్తున్న వేళ నానా జాతులను మేలుకొలుపుతున్న వేళ భారతీయులారా! మీరు ఈ సందేశం ఎడల ఏమరుపాటు చెందడం ధర్మమా?




# ఆత్మ పరిశీలన చేసుకున్న వేళ

భూప్రదక్షిణ చేసి వచ్చిన మాస్టర్ ఇ.కె. గారికై ఏర్పాటు చేయబడిన పౌరసన్మానసభ అది. అప్పటికది అయిదవసారో ఆరవసారో ఆయన అలా భూప్రదక్షిణం చేసి రావడం. వేదిక నిండుగా కన్నుల పండుగగా ఉన్నది. పెద్దలు, ప్రముఖులు, ఎందరెందరో మాస్టరుగారి ద్వారా వ్యక్తమవుతున్న వెలుగునకు అంజలి ఘటించారు. అలా అంజలి ఘటిస్తున్న వేళలో ఆ వెలుగుతో తాదాత్మ్యం చెందుతూ తాముూ ఆ వెలుగై వారు మాట్లాడుతున్న వేళ సభ వారితో శృతి కలిపి పరవశించిపోయింది. ఆ **"పరవశిస్తున్న వేళలో వారందరి హృదయమే తమ నిలయం"**గా గల మాస్టరు ఇ.కె.గారు. సందేశమిచ్చేటందుకై లేచి నిలబడ్డారు, పారవశ్యంలోనే సభ ఆయనవైపు ఏకాగ్రమైన స్థితిలో చూస్తున్నది. మాస్టరుగారు ఇలా అన్నారు "ఒక్కొక్కసారి భూప్రదక్షిణం చేసి వస్తున్నప్పుడు ఒక్కొక్క అనుభూతి, ఒక్కొక్క దర్శనం కలుగుతూ ఉన్నాయి. ఈసారి ఏమనిపించిందో తెలుసునా? వేదాధ్యయనం చేస్తున్నవారి సంఖ్య తగ్గింది అని మనం అనుకుంటున్నాం. అది పొరపాటు. వేదాధ్యయనపరుల సంఖ్య ఎప్పుడూ తగ్గదు అని.

భారతదేశంలో తగ్గింది కదా! కనబడుతూనే ఉంది కదా. అని మీరు అనవచ్చు. నిజమే. భారతదేశంలో తగ్గింది. ఈ తగ్గినవార విదేశాలలో పెరిగింది కనుక మొత్తం మీద లెక్క కడితే సంఖ్య సరిపోతుంది. కనుక వేదం చదువుకునే వారు తగ్గిపోయారు అని మనం బాధపడనక్కరలేదు. మనలో కొందరు ఈ సంఖ్య తగ్గిపోతుందే, మరి వేదాన్ని రక్షించడం ఎలా? అని బాధపడుతూ మాట్లాడుతూ ఉంటారు. నేను చెబుతున్నాను. మనం రక్షించాల్సినంతటి దీనస్థితి వేదాలకు రాలేదని, ఎన్నటికీ రాదని. వేదాన్ని కోల్పోతున్నందుకు భారతీయుడు భయపడాలి, బాధపడాలి. వేద ధర్మానికి దూరమై రక్షణను తాను కోల్పోతున్నానని భారతీయుడు గ్రహించగలగాలి. "నాయమాత్మా బలహీనే నలభ్యః" బలహీనులకు, అర్భకులకు, దుర్బలులకు ఈ విద్య దక్కదు కనుక అది తగిన వాళ్ళను స్వీకరించడానికై తరలి వెళుతోంది తప్ప, ఓ భారతీయుడా! నీవనుకుంటున్నట్లు అది అంతరించి పోవడం లేదు. అంత ప్రమాదం దానికెప్పుడూ రాదు. అది శాశ్వతమైనది. ఇలాంటి మనలాంటి తరాలను ఎన్నింటిని అది చూసిందో లెక్కపెట్టగలమా? ఇప్పుడు చెప్పండి అది మనని రక్షించేందుకు నిలబడి ఉన్నదా? లేక మనం దానిని రక్షించవలసిన వారమై ఉన్నామా? మనం మన ఇంటిలో దీపం తీసివేసినంత మాత్రాన అగ్ని దేవుడంతర్ధానమై పోతాడా? వెలిగించుకుంటున్న ప్రతిచోటా వాడు వ్యక్తమవుతునే ఉంటాడు కదా. వేదం అలాంటి అగ్నిలాంటిది.






మీరు ప్రాపంచికమైన వస్తువుల గురించి అడుగుతున్నట్లయితే ఆ విషయాల గురించి నేను చెప్పలేను. ముఖ్యంగా మరణానికి దగ్గరగా ఉన్నవారికి వస్తుపరంగా ఏమిచ్చినా ఎటువంటి ప్రయోజనం ఉండక పోవచ్చు. అతనికి కావాల్సింది మరణాన్ని ఆనందంగా స్వీకరించగలగటం. కాబట్టి అతనికి ఆ సాయం చేయగలిగింది ఏమిటి? బాబా అనుగ్రహం! బాబాను ప్రార్థించండి. అతను సంతోషంగా మరణించడానికి ప్రార్థించండి. జీవించాలనుకునేవారిని ఆనందంగా జీవించేలా సాయం చెయ్యమని ప్రార్థించండి. మీరూ ఆనందంగా ఉండాలని ప్రార్థించండి. కాబట్టి ప్రార్థించండి. ఎప్పుడూ ప్రార్థిస్తూనే ఉండండి. బాబా, బాబా, బాబా! పరిష్కారం అదే.

**భక్తుడు :** గురువుగారూ! ఇప్పుడు నాకు 76 సంవత్సరాలు. నేను నా చివరి శ్వాస గురించి, చివరి ఘడియ గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నాను. తుదిశ్వాస వరకు గురువు పాదాలు పట్టుకోవాలని, అప్పుడు ప్రాణాలు విడవాలని ఎక్కడో చదివాను. అలా చివరిలో ప్రాణం వదిలే విషయంలో నాకు కాస్త భయం కలుగుతుంది. దాని గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** అది మీకు ఎందుకు భయాన్ని కలిగిస్తోంది?

**భక్తుడు :** ప్రాణాలు వదలడం భయం కలిగిస్తోంది.

**గురువుగారు :** మరణభయం గురించి రమణమహర్షి సైతం చెప్పింది అదే. రమణులకు ఆత్మానుభవం కలిగినపుడు, ఆయనకు అనుభవమైంది మరణభయమే. ఎందుకంటే అక్కడ మనల్ని మనం కోల్పోతాం. మనం ఇన్నాళ్ళూ ఇష్టంతో అంటిపెట్టుకొని, పెంచి పోషించుకున్న మన గుర్తింపును (అహం) కోల్పోతాం. అది లేకుండా పోతుంది. మన దృష్టిలో అది మరణం. కానీ నిజానికి మరణం అంటే ఏమిటో మనకు తెలియదు. ఎందుకంటే మనం ఇప్పటిదాకా మరణించలేదు. కాబట్టి దానికి ఎలా భయపడతాము? ఏమో, మరణం జీవితం కన్నా అద్భుతంగా ఉండవచ్చు. ఎవరికి తెలుసు? కానీ మనం చావుకు ఎందుకు భయపడతామంటే మన దృష్టిలో చావంటే మనల్ని మనం కోల్పోవడం. అదే ఆధ్యాత్మికత అంటే కూడా. ఆధ్యాత్మికత కూడా "నిన్ను నువ్వు తెలుసుకున్నప్పుడు నిన్ను నువ్వు కోల్పోతావు. నీ అహంకారం నశిస్తుంది, లేకుండా పోతుంది. నువ్వంటూ మిగలవు, అక్కడ కేవలం 'అది' మాత్రమే ఉంటుంది" అని చెప్తుంది. మన దృష్టిలో మరణానికి ఒక రకమైన నిర్వచనమది. రమణులు ఈ విషయాన్నే, "ఆత్మహత్యకై తెగిస్తున్న జీవుల్లారా, రండి! మరణించడానికి ఇక్కడ ఒక అద్భుతమైన మార్గం ఉంది, అరుణాచలానికి రండి" అని అరుణాచలపదికంలో చక్కగా వ్రాసారు. కాబట్టి గురువు పాదాలు పట్టుకోవడమంటే ఒకరకంగా మరణాన్ని కోరుకోవడం లాంటిదే.



కానీ మనకు భౌతికంగా మరణం సంభవించినప్పుడు మనం గురువు పాదాల చెంత ఉంటే అది చాలా ప్రశాంతంగా, నిశ్చింతగా, అద్భుతంగా ఉంటుంది. గురువు పాదాల దగ్గర మరణం మరణంలాగా ఉండదు.

**భక్తుడు** : గురువుగారూ! మరణమంటే మేము భయపడటానికి కారణం మేము ఇంతకుముందు మరణించి ఉండటమా?

**గురువుగారు :** ఆ విషయం మీకు గుర్తుందా? మీకది గుర్తుండదు. మీరు చనిపోవాలనుకోకపోవడానికి కారణం జీవించాలన్న మీ కోరిక.

**భక్తుడు** : ఒకవేళ నాకది గుర్తు లేకపోతే, మరి ఎందుకని మరణానికి సంబంధించిన ఆలోచన ఎల్లప్పుడూ బాధతోనూ, దుఃఖంతోనూ కూడుకుని ఉంటోంది? అది సహజసిద్ధమైనది కాదా?

**గురువుగారు :** జీవితంలో దుఃఖం, బాధ ఉన్నప్పటికీ కూడా మీరు జీవించాలి అనుకుంటారు. ఆ బాధలను పోగొట్టుకొని ఆనందంగా జీవించాలనుకుంటారు. మీకు నచ్చనిది జీవితం కాదు, మన జీవితం యొక్క నాణ్యత మాత్రమే. మీరు ఇంకోలా జీవించాలనుకుంటున్నారు – ఆనందంగా జీవించాలనుకుంటున్నారు. మీకు మీ జీవితం పట్ల ఉన్న ప్రేమ మీకు జీవించాలనిపించేలా చేస్తుంది. మూలమైనది ప్రేమ–భయం కాదు.

**భక్తుడు** : గురువుగారూ! జ్ఞానధనులైన యోగులకు మరణానికి, జీవితానికి మధ్య వ్యత్యాసం ఉండదా? నేను నిసర్గదత్తమహరాజ్ గురించి చెబుతున్నాను. ఆయన 1981లో దేహాన్ని వదిలిపెట్టడానికి ముందు చేసిన ప్రసంగాలలో తాము దేహంతో ఉన్నా లేకపోయినా ఎటువంటి తేడా లేదని చెప్పారు. జీవన్మరణాలకు అతీతమైన ఆ స్థితిని పొందారు కాబట్టి తమకు జీవితంపట్ల ప్రత్యేకమైన ఆకర్షణేదీ లేదన్నారు వారు. ఈ విషయాన్ని విన్న కొంతమంది ఆశ్చర్యపోయారు. ఈ దృష్ట్యా చూస్తే ప్రేమకన్నా జ్ఞానం ప్రాథమికమైనదని చెప్పవచ్చా?

**గురువుగారు :** ఇక్కడ జ్ఞానమా, సత్యమా, ప్రేమా అన్నది ప్రశ్నకాదు. ఆయన తమ జీవితాన్ని ఎంతగానో ప్రేమించడం వలన ఆయన నిజమైన జీవితాన్ని పొందారు. మనమూ జీవితాన్ని ప్రేమిస్తాం కానీ మనకు నిజమైన జీవితం లభ్యం కాదు. ఆయన తమ జీవితాన్ని నిజంగా ప్రేమించారు. తత్ఫలితంగా నిజమైన జీవితాన్ని పొందారు. కాబట్టి ఆయన ప్రేమ పరిపూర్ణమైనది. ఒక్కసారి ప్రేమ పరిపూర్ణమైన తరువాత ఆయనకు జీవితాన్ని కోల్పోతామనే భయం కలగలేదు. జీవితం ఉన్నా లేకున్నా తామున్నామని, నిజమైన జీవితం ఉన్నదని ఆయనకు తెలుసు. మనకు ఆ విషయం తెలియదు కాబట్టి, "అయ్యో! జీవితాన్ని కోల్పోతామేమో!" అని భయపడుతుంటాం. కానీ ఆయనకు ఆ భయం లేదు.





**6. మానవ విలువలు** : **"ధర్మకార్యాలు హృదయ వైశాల్యాన్ని పెంచుతాయి" – వినోభాభావే.** ఇవి రోజు రోజుకీ క్షీణిస్తున్నాయి. ఏ సమాజంలో తల్లిదండ్రులు పిల్లలకి, గురువులు విద్యార్థులకి భయపడతారో ఆ జాతి నిర్వీర్యం కాక తప్పదు. ఎచ్చట విద్యావేత్తలు, తల్లిదండ్రులు, పూజ్యులు పరిహసించబడెదరో అచ్చట దుర్భిక్షములు విలయతాండవము చేయునని చాణుక్యుడు హెచ్చరించాడు, పట్టించుకోం. 12 సం॥లు కూడా నిండని పిల్లల్ని మార్కుల కోసం, చుట్టాల దగ్గర స్టైలు కొట్టడం కోసం మరియు బాధ్యతతో పెంచడం చేతకాక హాస్టల్స్‌లో పడేసి చేతులు దులుపుకుంటే–వాళ్ళు పెద్దయ్యాక తల్లిదండ్రుల్ని ఓల్డేజ్ హోమ్స్‌లో చేర్చి ఋణం తీర్చుకుంటారు!

'కంటేనే అమ్మ అని అంటే ఎలా? పిల్లలని క్రమశిక్షణతో చక్కగా తీర్చిదిద్దేవారు తల్లిదండ్రులు. కుటుంబాలు సుఖంగా, సరదాగా ఉంటేనే ప్రపంచశాంతి సాధ్యం. అందుకే పిల్లల ఎదురుగా తల్లిదండ్రులు కొట్టుకు చావకూడదు. తల్లిదండ్రుల మంచి అలవాట్లు పిల్లలకు రావచ్చు, రాకపోవచ్చు. కానీ సిగరెట్లు తాగడం, మందు కొట్టడం, అడ్డగోలుగా మాట్లాడడం, పొగరుగా సమాధానం చెప్పడం, బూతులు మాట్లాడటం, అలిగి సాధించడం, చీటికీ మాటికీ చచ్చిపోతానని బెదిరించడం, తాతల్ని, అమ్మమ్మల్ని విసుక్కోవడం లాంటి చెడ్డ అలవాట్లు ఇట్టిట్టే అంటుకుంటాయి.

పిల్లలకి సరైన ట్రైనింగు చిన్నవయసులోనే ఇవ్వాలి. స్విమ్మింగు, సైక్లింగ్ విధిగా నేర్పాలి. పిల్లలని అర్థం చేసుకొని చదవమని, బట్టీపట్టి చదివి వచ్చే మార్కులకై ప్రాకులాడవద్దని, ముందు మీరు నమ్మి, ఆపై పిల్లలకు చెప్పండి. అమ్మాయయినా, అబ్బాయయినా రోజూ చెమటపట్టే ఆటలాడటం, 24/7 ఇంగ్లీషు–ఇంగ్లీషు ప్యాకెట్ డిక్షనరీ దగ్గర ఉంచుకోవడం, ఇంగ్లీషు వార్తలు వినడం, రోజూ డైరీ వ్రాయడం, ఇంగ్లీషు న్యూసు పేపరు 15 నిమిషాలు పైకి చదవడం, తమ భావాల్ని నిర్భయంగా వ్యక్తపరచడం, రాత్రి నిద్రపోయే ముందు పళ్ళు తోముకోవడం, సున్నితంగా, ప్రేమతో హుందాగా వ్యవహరించడం – వంటివి అలవాట్లు చెయ్యాలి. " One who receives a stranger with love and courtesy is the citizen of the World" (ప్రపంచ పౌరుడు–విశ్వమానవుడు). ప్రపంచంలో అన్ని కష్టనష్టాలకీ, సమస్యలకీ పరిష్కారం మూడే మూడు మార్గాలు : 1. విద్య 2. విద్య 3. విద్య. "Education is the one and only one solution to all the miseries and worries of the world. Teaching is the profession that teaches all other professions". No Pains - No Gains. శాశ్వతమైన సుఖాలు (సౌఖ్యం) కావాలంటే తాత్కాలికమైన బాధలకి సిద్ధపడాలి. ఉగ్రూతలూగించే వాటిని చిరునవ్వుతో వదిలేయాలి. చదువు ద్వారా, అవగాహన సదస్సుల ద్వారా, ఎవేర్‌నెస్ ద్వారా మాత్రమే మన మానవ జీవితాలలోని ఏ సమస్యనైనా పరిష్కరించగలమని తెలుసుకొని **మీరు చేసే ప్రతి పనిలో క్రమశిక్షణ, పట్టుదల, నిస్వార్థ సేవ గుభాళించాలని ఆశిస్తూ... శుభాభినందనలతో.... – మురళీకృష్ణ (మురళీయం)**




ఎక్కువ ఉంటే ఆ జాతి అంతగా సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. వైవిధ్యం అంటే వెరైటీ, వైవిధ్యమే భారతదేశ బలం అన్నాడు కార్ల్‌మార్క్స్. బలమే కాదు, అందం కూడా. సముద్రమట్టం పెరగడం వలన అన్నింటికన్నా ముందు అంతరించి పోయే దేశం మాల్దీవ్స్. ఉదాహరణకు, అక్కడ కేవలం 10 జాతుల పక్షులే ఉన్నాయి. మరి ఇండియాలోనో? 1200 జాతుల పక్షులున్నాయి. **వైవిధ్యం ఎంత తక్కువ ఉంటే అక్కడ బ్రతుకు అంత దుర్భరం. ఎంత ఎక్కువ ఉంటే అంత ఆనందం, ఆహ్లాదకరం, స్థిరత్వం**. ఇప్పుడు ఇండియాలోకూడా తగ్గిపోతున్నాయి. ప్రకృతిని ఆరాధించడం మొదలెట్టాలి. **'నేను భారతదేశాన్ని ప్రేమించేవాడిని, కానీ విదేశాలు వెళ్లొచ్చాక పూజించడం మొదలుపెట్టా' అన్నాడు వివేకానంద.**

**4. కాలుష్యం, వ్యర్థ పదార్థాలు**: రోజుకి మనిషి 120 లీటర్ల మురికి నీరు, 500 గ్రా॥ ఘన వ్యర్థాలను బైటకి పారేస్తుంటాడు. వీటిని తగు రీతిలో కొన్నింటిని కప్పెట్టాలి. కొన్నింటికి నిప్పెట్టాలి. ఒక ఏడాదిలో నువ్వు ఏదైనా ఒక వస్తువును కానీ, బట్ట (చీర)ను కానీ వాడకపోతే అది వ్యర్థం అన్నమాట. మరొకరికి అది అర్థవంతమైనది కావున అది వారికిచ్చెయ్. అదే విజ్ఞత. అది కూడా దానమే! **సింపుల్ లైఫ్ స్టైల్స్ (నిరాడంబర జీవనశైలి) ద్వారా వ్యర్థాల్ని కాలుష్యాల్ని చాలామటుకు తగ్గించవచ్చు.** సూరత్‌సిటీని గుజరాత్ లెట్రిన్‌గా వర్ణించేవారు. మన తెలుగు ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ **ఎస్.ఎ.రావు** కమీషనర్‌గా ఉండగా 1997 సం॥ నుండి చండీగఢ్ మరియు సూరత్ పట్టణాలను పరిశుభ్రమైన క్లీన్‌సిటీస్‌గా చేసారు. దేశంలో మొదటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. మీ టౌన్, సిటీలకై మీరేం చేస్తున్నారు? సూరత్ ఖూబ్ సూరత్‌గా మారగాలేనిది మీ టౌన్ ఎందుకు మారలేదు? **ఊరు మారాలంటే మనం ముందు మారాలి.** ఏ టౌన్ అయినా, ఏ సిటీ అయినా ఎందుకు మారలేదు?

**తగ్గిపోతున్న వనరులు** : భూగర్భజలాలు, నదీజలాలు, గ్యాస్, బొగ్గు, ఇనుము, మెగ్నీషియం, సీసం, చెట్లు, అడవులు, వన్యప్రాణులు వంటి వనరులు 90 శాతం పైగా అంతరించిపోయాయి, మంచి మనుషుల్లాగే! కావున కనీసం ఉన్న వాటినైనా సరిగ్గా కాపాడుకోవాలి, వాడుకోవాలి. చాలాచోట్ల ప్రతీ 1000 మంది మగవారికి 930 మంది ఆడవారు మాత్రమే ఉంటున్నారు. అంటే 2000 మనుషులకీ 70 మంది స్త్రీలు తక్కువ ఉంటున్నారు. అంటే ఇండియా 120 కోట్ల జనాభాలో 4 కోట్ల 20 లక్షల మంది స్త్రీలు తక్కువ ఉన్నారు. అన్ని వనరులలోకీ గొప్పది మానవ వనరులు, ముఖ్యంగా స్త్రీలు. కానీ 4 కోట్ల మంది భారత స్త్రీలను మనం నాశనం చేసేసాం. ఎవరిదీ పాపం? ఆడపిల్లల భ్రూణ హత్యలను నివారించడానికి ఏం చెయ్యగలమో ఆలోచించండి! "అయిపోయిన సంగతి సరే. రేపు అంతరించి పోతున్న జీవి ఏమిటో చూడాలనుకుంటున్నారా? కాస్త లేచి వెళ్లి అద్దం ముందు నిలబడండి."






**భక్తుడు** : అంటే, మరణం తరువాత కూడా తాముంటామని జ్ఞానికి తెలుసు.

**గురువుగారు :** అవును.

**భక్తుడు** : గురువుగారూ! నేను జీవితం యొక్క అశాశ్వతత్వాన్ని మరచిపోయి, నా జీవితానికి ఎప్పటికీ ముగింపు లేదన్నట్లుగా జీవిస్తున్నాను.

**గురువుగారు :** నిజానికి ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. ఈ అనిశ్చితి ఎప్పుడూ ఉంటుంది. కానీ దానిని ఎవ్వరూ గమనించరు. ఒకసారి శ్వాస తీసుకుని వదిలిపెట్టినప్పుడు మనం మరో శ్వాస తీసుకుంటామా లేదా అనే విషయం మనకు నిశ్చయంగా తెలియదు. ఊపిరి తీసుకోవడమనేది మనం ప్రయత్నపూర్వకంగానో లేక మన ఇష్టానుసారంగానో చేసేది కాదు. ఊపిరి తీసుకోవడమనేది మన ఇష్టప్రకారం చేసేదైతే, అది మన చేతుల్లో ఉంటే ఎవరూ ఊపిరి తీసుకోవడం ఆపరు. అది వీలుకాదు. మనం అటువంటి నిస్సహాయస్థితిలో ఉన్నాం, కానీ మరో రకంగా చూస్తే అది ఎంతో చక్కని స్థితి. అది చూడటానికి నిస్సహాయతలా కనిపించినా, ఆ స్థితి చాలా హాయిగా ఉంటుంది. కాబట్టి దుఃఖాన్ని శ్వాసించి ఉక్కిరిబిక్కిరి కావడంకన్నా ప్రతి శ్వాసలో ఆ ఆనందాన్ని ఆస్వాదిద్దాం.

**గురువుగారు :** మీరు ఎంతో ఎంతో ఆనందంగా ఉండాలని – ఆ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ మీ చుట్టూ ఉండే వాతావరణాన్ని, ఇతరులను ఆనందంగా ఉండేటట్లు చెయ్యాలని నేను కోరుకుంటాను. ఎంత ఆనందంగా ఉండాలంటే, మీరు ఒక్కరే ఆనందంగా ఉంటే సరిపోదు, మీ చుట్టుప్రక్కల వారందరూ కూడా ఆనందంగా ఉండాలి.

**భక్తుడు** : గురువుగారూ! మా జీవితాలు మీరు చెప్తున్న దిశగా మారాయని ఇక్కడున్న ప్రతి ఒక్కరం చెప్పగలం. దానికోసం మేము చేసింది కూడా ఏమీ లేదు. అంతా మీ అనుగ్రహం, బాబా అనుగ్రహం. కానీ మేము చెయ్యగలిగింది ఏమైనా ఉందా?

**గురువుగారు :** నేను మిమ్మల్ని ఏదో చెయ్యమని చెప్పడం లేదు. బాబా ఇచ్చిన దానిని, ఆయన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నదానిని అనుభవంలోకి తెచ్చుకొని ఆనందంగా ఉండమని చెబుతున్నాను. అంతే! నేను ఈ విషయం మీకు మళ్ళీ మళ్ళీ ఎందుకు చెబుతున్నానంటే మీ జీవితాలు ఒకే విధంగా, యాంత్రికంగా మారిపోయినట్లనిపిస్తుంది. జీవితంలోని (ఉత్సుకతను) థ్రిల్‌ను కోల్పోతున్నారు. యాంత్రికంగా తయారుకావద్దు. ప్రతిరోజూ ఓ క్రొత్త రోజు కావాలి. నిత్యనూతనం కావాలి. మీరు నిన్న లేనట్లుగా, రేపటికి మీరు ఉండనట్లుగా జీవించాలి. ఈ రోజు, ఈ క్షణమే నిజమైన సత్యం, నిజమైన వాస్తవం. ఆనందంగా పరిపూర్ణమైన జీవితాన్ని జీవించండి. జీవితంలోని కళను ప్రేమించండి. కళాకారునిగా జీవించండి. జీవితాన్ని అలా ఆస్వాదించండి. నేను మీకు చెప్పినట్లు, మీకేదైనా సమస్య




ఉంటే నాకు చెప్పండి. నేను చూసుకుంటాను. మీకు సమస్యలేవీ లేకపోతే ఆనందంగా ఉండండి. (గురువుగారు నవ్వుతూ) ఇది మీకంత కష్టమైన విషయంలా అనిపిస్తోందా?

**గురువుగారు :** సద్గురువుపట్ల మనకు గల ప్రేమకు మూలకారణం జీవితంపట్ల మనకుండే ప్రేమ. మనం సాయిబాబానో, రమణమహర్షినో, అరుణాచలాన్నో లేదా మరెవరినైనా సరే ప్రేమిస్తున్నామంటే దానికి కారణం మనల్ని మనం ప్రేమించుకోవడమే. వాళ్ళు మన అస్తిత్వానికి, మన జీవితానికి – మనం ఎలా ఉండాలనుకుంటున్నామో దానికి సంపూర్ణమైన ప్రతిరూపంగా నిలుస్తారు కాబట్టే మనం వాళ్ళను ప్రేమిస్తాము. జీవం కోల్పోయిన మన జీవితం యొక్క ప్రస్తుత స్థితి మనకు నచ్చదు. జీవితం పరిపూర్ణంగా అనుభవమయ్యే ఒకానొక స్థితికి సద్గురువు ప్రతిరూపంగా నిలుస్తారు. కాబట్టి జీవితం పట్ల మనకు గల ప్రేమే సద్గురువు పట్ల ఆకర్షణగా (ఇష్టంగా) వ్యక్తమవుతుంది. మనం మన జీవితాన్ని నిజంగా ప్రేమిస్తూ, అందులోని ప్రతిదీ జీవితమేనని తెలుసుకుంటే, మనం జీవితం మొత్తాన్ని ప్రేమిస్తాం. అప్పుడు ప్రతిదీ మన జీవితం యొక్క విస్తృత భాగంగా మారుతుంది. కాబట్టి ఒక విధంగా సాయిబాబా మన జీవితానికి విస్తృతరూపమవుతారు. (గురువుగారు నవ్వుతూ...)

## సేవ

సేవ అంటే అవసరమైన సాటివారికి సహాయం చేయడంగా అందరి భావన. కాని ఈ యుగంలో ఇప్పటి కాలంలో ఆలోచిస్తే మనం సక్రమంగా జీవించడమే సేవగా పరిణామం చెందింది. మనం సరిగా జీవించకపోతే మన ముందు తరాలకు మనం ఇచ్చేది కాలుష్య వాతావరణాన్నే. కనుక నిజమైన సేవ అంటే ఈ కాలంలో మనం పర్యావరణానికి ఇబ్బంది కలిగించక జీవించడం అవుతుంది. అందుకే ప్రస్తుత మన దేశనేత పిలుపు **"స్వచ్ఛభారత్"**

"Your birth may be common but, death must be history" "If your father is poor it is not your mistake, but, if your son is poor it is your mistake" అనీ, భారతంలో 'మనిషి దేనివలన లాభము పొందును? అన్నింటికన్నా విలువైన సంపద ఏది అనే ప్రశ్నలకు ధర్మరాజు చెప్పిన "మనిషి దానము వలన లాభము పొందును, జ్ఞాన ధనం మహాధనం" అనే సమాధానం నూటికి నూరు శాతం నగ్న సత్యమనీ, "సత్యం ఏవ జయతే – ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందనీ" మనసా వాచ కర్మణా త్రికరణశుద్ధిగా నమ్మే మీకు ముందుగా నా హృదయ పూర్వక నమస్సుమాంజలులు.

224 దేశాల్లోని 700 కోట్ల జనాభా సమస్యలను, బాధలను సరిగ్గా అర్థం చేసుకుంటే మనం అసలు ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? అని చెయ్యబోయే సేవా కార్యక్రమాలలో స్పష్టత వస్తుంది. 30 సం॥ల నుంచి సేవలందిస్తున్న ఇంటర్నెట్ ప్రకారం, మన మానవజాతి వర్తమాన, భవిష్యత్ కాలాలలో ఎదుర్కొనే ప్రధాన సమస్యలు / అంశాలు ఏంటో చూద్దాం.




**1. బీదతనం, పోషక ఆహారం లేకపోవుట, వ్యాధులు, ఆరోగ్యం :** ఇండియాలో ప్రతిరోజూ 5 సం॥లలోపు పిల్లలు 7000 మంది చనిపోతున్నారు. ఒక్క హైదరాబాదులో చెత్త ఏరుకునే పిల్లలు (rag pickers) 25,000 మంది ఉన్నారు. టీస్టాల్స్‌లో పనిచేసేవారు, బూటు పాలీష్ చేసేవారు, బెగ్గర్స్ వంటివారు మరో 30,000 మంది పిల్లలు ఉన్నారు. చైనా లాంటి దేశాలతో పోల్చి చూస్తే జీవనకాలం కూడా తక్కువే. ప్రధాన కారణం ఆరోగ్య అలవాట్లు. పిల్లలకు సరైన పోషక ఆహారం అందచేయాలి. ఫాస్ట్‌ఫుడ్స్ తగ్గించాలి. రాత్రి 6 దాటాక ఆయిల్ పదార్థాలు తినకూడదు. కానీ తింటాం. భోజనానికి ముందు తరువాత వేడి పదార్థాలు (సూప్, చారు, టీ) వంటివి ఎంత మంచివో చల్లని పదార్థాలు అంత హానికరమైనవి. కానీ, మనం భోజనంతో పాటు కూల్‌డ్రింక్స్ తాగుతాం. ఐస్‌క్రీమ్స్ తింటాం, క్యాన్సర్ కొని తెచ్చుకుంటాం, పిల్లలకి బహుమతిగా ఇస్తాం. రాత్రిపూట పెరుగు ఆయుక్షీణం (మజ్జిగ మంచిదే) అన్నది ఆయుర్వేదం, అని తెలిసీ పెరుగు తింటాం, పెడతాం. **'అజ్ఞానం కన్నా కీడు చేసేది నిర్లక్ష్యం'** (Be Careful but not Careless - **SriBabuji**) అని తెలిసీ ఇలాంటి విషయాన్ని పెడచెవిని పెడతాం, **"విజయానికి ముందు వినయం ఉంటే, పతనానికి ముందు పొగరు ఉంటుంది"** అని తెలిసీ ఆచరించం. పొగరు అంటే వినిపించుకోకపోవడమే, తప్పు అని తెలిసీ చెయ్యడమే!

**2. వాతావరణంలో మార్పు** : కార్బన్ డై ఆక్సైడ్‌ను పర్యావరణంలో 387 నుంచి 350 పిపిఎంకు తగ్గించకపోతే భావితరాలు సరిగ్గా బ్రతకలేవు. దీనివలన ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు పర్వతాలు కరగడం, ఆపై వరదలు, సముద్ర మట్టం పెరగడం, కొంతకాలానికి మంచు లేక జీవనదులు ఎండిపోవడం జరుగుతాయి. **మన మంచి జీవనశైలి, అలవాట్ల మూలంగా మాత్రమే గ్లోబల్ వార్మింగ్‌ను నివారించగలం.** కారుకి బదులు బస్సు, ట్రైనులను వీలైనంతగా వాడాలి. సైకిలు మరీ మంచిది. నడిస్తే చెప్పక్కర్లే. ఆర్యోగమే కాదు, పుణ్యం కూడా. పర్యావరణానికి కొత్త ప్రాణం పోసినట్లే. ఇలా చేసి కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించేందుకు దోహదపడితే కార్బన్ క్రెడిట్స్ మనకు వస్తాయి. In International Carbon Trade, 1 Carbon credit = 1 ton $co_2$ Removed = Rs.600 in UNO. ఇప్పుడు ఆలోచిద్దాం... చెట్టు విలువ గురించి. మనకవసరమయ్యే ఆక్సిజన్‌నిచ్చి (ప్రాణవాయువు), మనం వదిలే కర్బన వాయువుని స్వీకరించే చెట్టుకి ఎన్ని క్రెడిట్స్, అందుకే అది పూజనీయం అయింది.

**3. జీవ వైవిధ్యం తగ్గిపోతోంది** : పర్యావరణంలో రకరకాల మొక్కలు, పక్షులు, జీవరాసులు ఎంత